ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
గురువారం 27 జూన్ 2024 | 3

జూలై 1న ఇంటి వద్దకే.. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు

- ప్రజాప్రతినిధుల సమక్షంలో సచివాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో పంపిణీ
- జిల్లాలో భారీగా పెరిగిన పెన్షన్ సొమ్ము
- జిల్లాలో 2,44,302 మంది పింఛన్‌దార్లు
- రూ.165.13 కోట్లు పంపిణీ.. గత నెలలో రూ.72 కోట్లే
- బ్యాంకుల వారీ టార్గెట్లు కేటాయింపు
- 29న బ్యాంకుల్లో జమ.. ఆయా సెక్రటరీలతో డ్రా
- డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి

రాజమహేంద్రవరం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లను జూలై 1న ఆయా లబ్ధిదార్ల ఇంటి వద్దకే వెళ్లి, ప్రజాప్రతినిధుల సమక్షంలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు పంపిణీ చేయనున్నారు. దీనికి అవసరమైన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. బ్యాంకుల వారీ కేటాయింపులు చేశారు. ఈనెల 29నే బ్యాంకులలో డబ్బు జమఅవుతుందని, ఆయా సెక్రటరీలు డబ్బు డ్రా చేసి 1వ తేదీన ఉదయం ఆరు గంటల నుంచే పంపిణీ చేయనున్నామని జిల్లా గ్రామీణాభివృద్ధి ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్‌వీవీఎస్ మూర్తి తెలిపారు. ఈమేరకు బుధవారం రాత్రి ఆయన ఒక ప్రకటన జారీచేశారు. జిల్లా పింఛన్ల సొమ్ము భారీగా పెరిగిందని, గతంలో నెలకు జిల్లాలో సుమారు రూ.72 కోట్లు పంపిణీ చేస్తే, జూలైలో ఏకంగా జిల్లా వ్యాప్తంగా 2,44,302 మందికి రూ.165.13 కోట్లు పంపిణీ చేయనున్నట్టు ఆయన చెప్పారు. రూ.3 వేల నుంచి 4 వేలకు పెంచిన పింఛన్లకు ఏప్రిల్ నుంచే అమలుచేస్తున్నామని, ఆ సొమ్ము కూడా కలిపి జూలై 1న వృద్ధాప్య, వితంతువు, చేనేత, గీతకార్మికులు, పిషర్‌మెన్, ఒంటరి మహిళ, సంప్రదాయ చెప్పుకుట్టేవారు, కళాకారులు, ట్రాన్స్‌జెండర్స్, ఆర్ట్ (పీఎల్‌హెచ్‌టీవీ), డప్పు కళాకారులు వంటి 11 కేటగిరీల వారికి రూ.7 వేలు ఇస్తారన్నారు. వీరికి రూ.3 వేల నుంచి 4 వేలకు పెరిగిందని, ఆగస్టు నుంచి నెలకు 4 వేల వంతున పెన్షన్ వస్తుందన్నారు. దివ్యాంగులు, మల్టీ డెఫార్మిటీ లెప్రసీ బాధితులకు రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచారని, ఇక ప్రతీ నెలకు 6 వేల సొమ్ము చొప్పున వస్తుందని చెప్పారు. పూర్తిగా దివ్యాంగులైన వారికి రూ.5 వేల నుంచి రూ.15 వేలకు పెంచారని చెప్పారు. పెరల్సిస్‌తో మంచంమీద, కుర్చీలో నుంచి లేవలేనివారికి, వివిధ ప్రమాదాల్లో గాయాలపై కదలలేని స్థితిలో ఉన్నవారికి ఇవి వర్తిస్తాయని చెప్పారు. కిడ్నీ, డయాలిస్ బాధితులకు రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పింఛన్ పెరిగిందన్నాను. మొత్తం 18 రకాల పింఛన్లు అమలు చేస్తున్నామన్నారు. ఈ పెన్షన్ల పంపిణీకి సంబంధించి పూర్తి చర్యలు తీసుకుంటున్నామని పీడీ మూర్తి చెప్పారు.


మూర్తి, డీఆర్‌డీఏ పీడీ


శివ ధనస్సులా.. ఆకాశం మేఘావృతమై ఉన్న వేళ పెరవలి మండలం తీపర్రు గోదావరి తీరంలో ఆకాశంలో శివ ధనుస్సులా మబ్బులు కనిపించాయి. పుష్కరాల రేవులో ఉన్న శివుని విగ్రహం వెనుక ఇది కనిపించడంతో ఉదయాన్నే గోదావరి తీరానికి వెళ్లే రైతులు ఈ దృశ్యాన్ని వీక్షించారు. - పెరవలి

పోలీస్ 'ట్రయల్స్'



సార్వత్రికల ఎన్నికల పండుగ ముగిసింది. కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. వచ్చీ రావడంతోనే బ్యూరోక్రాట్ల ప్రక్షాళన మొదలుపెట్టింది. ఉన్నత స్థాయిలో గత ప్రభుత్వ పెద్దలతో అంటకాగి ప్రజాస్వామ్యాన్ని అభాసుపాలు చేసిన వారి పనిపట్టే చర్యలు వేగవంతం చేసింది. ముందుగా రాష్ట్ర స్థాయి అధికారులను స్థానం చలనం చేసింది. తర్వాత జిల్లా స్థాయి అధికారుల వంతు వచ్చింది. వైసీపీకి కొమ్ము కాశారనే ఆరోపణలు ఉన్న కలెక్టర్ మాధవీలతను ఇప్పటికే బదిలీ చేసి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. సాధారణ పరిపాలనా శాఖ (జీఏడీ)లో రిపోర్టు చేయాలని సీఎస్ ఆదేశించారు. జిల్లా స్థాయిలో మరికొందరు అధికారుల స్థాన చలనంపై ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. ఇదిలా ఉండగా డివిజన్, సబ్-డివిజన్ అంతకంటే తక్కువ స్థాయి అధికారుల బదిలీల జాతర మొదలుకానుంది. ముఖ్యంగా పోలీస్ శాఖలో బదిలీల విషయం త్వరలో తేలనుంది. దీంతో పోలీసు అధికారులు 'ట్రయల్స్' మొదలు పెట్టారు. ముఖ్యంగా ఇన్స్‌పెక్టర్లు, డీఎస్పీలు పోస్టింగుల కోసం అధికార పార్టీ నేతలను ప్రసన్నం చేసుకొనే పనిలో ఉన్నారు. ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పోలీసుల్లో బదిలీలు జరిగాయి. వారు ఇప్పుడు తమ 'సొంత' గూటికి చేరుకోడానికి ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు. అలా వచ్చిన వారిలో మరికొందరు అదే స్థానంలో కొనసాగడానికి, ఇంకొందరు లాభసాటి స్టేషన్‌లో పోస్టింగులకు నేతల చుట్టూ దుడ్డుతో ప్రదక్షిణలు చేస్తున్నారు.

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

- కావాల్సిన చోట పోస్టింగ్‌కి.. ఎవరి ప్రయత్నంలో వారు..
- త్వరలో బదిలీల జాతర
- వైసీపీకి అంటకాగిన వారిలో దడ
- అధికార పార్టీ నేతలను ప్రసన్నం చేసుకొనే పనిలో బిజీ

జిల్లాలోని ఎస్ఐ నుంచి డీఎస్పీ వరకూ బదిలీలకు సంబంధించి జాబితా సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. ఎన్నికల కోటాలో అడిషనల్ ఎస్పీలు కూడా జిల్లాకు వచ్చారు. వీరందరూ ఎక్కడకు ఎవరు వెళ్లారో తెలియని పరిస్థితి నెలకొంది. అయితే ఎన్నికల సమయంలో ఎక్కువగా కర్నూలు, కృష్ణా తదితర జిల్లాల నుంచి తూర్పుగోదావరికి వచ్చారు. వారందరూ ఇప్పుడు వారి ప్రాంతాలకు వెళ్లాలని కోరుకుంటున్నారు. ఎన్నికల కోటాలో రావడంతో మూడు నాలుగు నెలల్లో తిరిగి వెనక్కి వెళ్లిపోతామన్న ఉద్దేశంతో కుటుంబాలను ఇక్కడికి తీసుకురాలేదు. పిల్లలను కూడా అక్కడి స్కూల్స్‌లోనే చేర్పించారు. ఇప్పుడు వారి మునుపటి ప్రదేశానికి తప్ప ఎక్కడికి బదిలీ చేసినా తిప్పలు తప్పవనే ఆందోళన నెలకొంది. ఎన్నికల సమయంలో వైసీపీ నేతలు తమకు కావాల్సిన వాళ్లను తీసుకొచ్చుకున్నారు. అందుకు అప్పటికే ఆ స్థానంలో ఉన్న అధికారులను వేరొకచోటికి పంపించేశారు. అలా వచ్చిన వాళ్లు ఎన్నికలో సమయంలో వైసీపీ నేతలకు తమకు తోచిన 'సహాయం' చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు ఆ అధికారులు కూడా అధికార కూటమి నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని సమాచారం. ఎన్నికల సమయంలో రాజమహేంద్రవరం రూరల్‌లో ఓ పోలీస్ స్టేషన్, కొవ్వూరు రూరల్ పీఎస్‌కి వచ్చిన అధికారి, రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలోని ఓ జోన్ అధికారి వైసీపీ నేతలకు 'బాగా' కావాల్సిన వారనే ప్రచారం ఉంది. మరో జోన్ అధికారిపై ఎన్నికల సమయంలోనే ఎన్నికల సంఘానికి టీడీపీ ఫిర్యాదు చేసింది. రాజమహేంద్రవరం రూరల్‌లో ఓ ఇన్‌స్పెక్టర్ అదే పరిధిలోని మరో స్టేషన్‌లో సీటుకు ప్రయత్నించి సఫలీకృతం వరకూ వచ్చినట్టు చెప్పుకుంటున్నారని పోలీసు వర్గాల్లో వినవస్తోంది. మరికొందరు రాబడి బాగా వచ్చే స్టేషన్ కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు. జిల్లాలోని ఇసుక ర్యాంపులు, గ్రావెల్, కంకర, మట్టి వనరులు పరిధిలోకి వచ్చే స్టేషన్లు, రాజమహేంద్రవరం సిటీ, రూరల్ పరిధిలోని స్టేషన్లలో పోస్టింగులకు ఎవరి దారిలో వారు ట్రయల్స్‌లో మునిగిపోయారు. అయితే డీఐజీగా ద్వారకా తిరుమలరావు ఇటీవలే బాధ్యతలు స్వీకరించారు. దీంతో కింది స్థాయి సిబ్బంది బదిలీలపై త్వరలోనే దృష్టి సారించే అవకాశం ఉందంటున్నారు. ఎన్నికల కోటాలో వచ్చిన వాళ్ల బదిలీ తప్పదనే సాంకేతాలు వస్తున్నాయి.

● మంచి అధికారులు వెళ్లిపోతే..

జిల్లాలో ఏ పార్టీకి కొమ్ముకాయకుండా ఉన్న కొందరు పోలీసుల అధికారులు సైతం ఆందోళనలో ఉన్నారు. వైసీపీ నేతలు ఎంత ఒత్తిడి చేసినా, ప్రలోభాలకు గురిచేసినా ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ నిబంధనల ప్రకారం వారు నడుచుకున్నారు. వైసీపీ నేతలు తమ వారిని సదరు సీటులో కూర్చోబెట్టుకోడానికి పక్కకు తప్పుకోమంటే తలవంచుకొని వెళ్లిన వాళ్లూ ఉన్నారు. ఎన్నికల సమయంలోనూ ఈ తంతు నడిచింది. ఏ పార్టీ వాళ్లనూ నొప్పించకుండా జిల్లాలో ఎన్నికలు సజావుగా జరగడానికి, శాంతిభద్రతలకు ముప్పు వాటిల్లకుండా ఉండడానికి దోహదపడ్డారు. అటు ప్రజలతో ఇటు తమ సిబ్బందితో ఇబ్బంది లేకుండా నడుచుకున్నారు. ఎలాంటి విపత్కర సందర్భం ఎదురైనా సంయమనం పాటించారు. 'తూర్పు' ప్రశాంతం అనే మాటను రుజువుచేశారు. అలాంటి వారిని విడుచుకోడానికి అధికార కూటమి నేతలు సిద్ధంగా లేరని తెలుస్తోంది. ప్రస్తుతం జిల్లాస్థాయిలో పోలీస్ పరంగా మంచి టీం ఉందనే ప్రశంసలు ఉన్నాయి. అలాంటి పరిస్థితుల్లో మంచి అధికారులు వెళ్లిపోతే ఎలాంటి వారు వస్తారో అనే మీమాంశ కూడా కూటమి నేతల్లో ఉంది. పైగా కొత్తగా అధికార పగ్గాలు చేపట్టారు. జిల్లా అలవాటు పడిన వాళ్లను కదుపుకొంటే ఇబ్బందులు తప్పవనే ఆలోచన ఉంది. అలాంటి అధికారులను కొత్త ప్రభుత్వం వచ్చిందనే కారణంతో బదిలీ చేస్తే అది వారిని ఇబ్బందిపెట్టే పరిస్థితి వస్తుంది. ఆయా అధికారులను పంపేస్తే వైసీపీకి కొమ్ముకాశారని, అక్రమాలకు తలొగ్గారనే అపవాదు వారిపై పడే అవకాశం ఉంది. అందువల్ల అందరినీ ఒకే గాటన కట్టడం సరికాదనే వాదన బలంగా వినవస్తోంది. అలాగే ఐదేళ్లపాటు లూప్‌లైనులో ఉన్నవారు మంచి పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్నారు. వారితో వైసీపీ నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఈ ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందని వారంతా ఆశిస్తున్నారు.

● కిందిస్థాయి ఎదురుచూపులు

ఎక్కడికి బదిలీ చేస్తారో.. ఏ ఊర్లో పిల్లల్ని బడిలో చేర్చాలో.. తీరా చూస్తే తరగతులు మొదలైపోయాయి.. బదిలీల విషయం ఇంకా ఏమీ తేల్చలేదు.. ఇదీ ప్రస్తుతం కొన్ని పోలీసు కుటుంబాలు అనుభవిస్తున్న మనోవేదన. ఇన్స్‌పెక్టర్ నుంచి పైస్థాయి వరకూ అర్థబలంతో మేనేజ్ చేసుకొనే పరిస్థితి ఉంటుంది. కానీ, హోంగార్డు నుంచి ఏఎస్ఐ స్థాయి వరకూ ఆర్థికంగా సతమతమవుతూనే ఉంటారు. పోస్టింగుల కోసం చెల్లించుకొనే పరిస్థితి ఉండదు. ఈ నేపథ్యంలో జిల్లాలోని కొందరు పోలీసులు బదిలీల కోసం ఎదురుచూస్తున్నారు. కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ వరకూ బదిలీ చేసే అధికారం ఎస్పీ చేతిలో ఉంటుంది. సుదీర్ఘంగా ఒకచోట పనిచేస్తున్న ఆ సిబ్బందిని ఏడాది కిందట ఎస్పీగా సుధీర్‌కుమార్‌రెడ్డి ఉన్న సమయంలో స్థాన చలనం కలిగించారు. తర్వాత ఐదేళ్ల మించి ఒకచోట విధులు నిర్వర్తిస్తున్న వాళ్ల బదిలీలపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. గత నెలలో బదిలీల కోసం కొందరు అర్జీలు పెట్టుకున్నారు. కానీ 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమైనా వాటిపై ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదని తెలుస్తోంది. ఇప్పటికే ఈ నెల 13 నుంచి పాఠశాలలు, కళాశాలల్లోని తరగతులు ప్రారంభమైపోయాయి. సిలబస్‌ని కూడా మొదలుపెట్టేశారు. కానీ బదిలీల విషయంపై ఇంకా స్పష్టత లేదు. దీంతో స్కూల్‌లో ఇంకా చేర్పని పిల్లలకు సమాధానం చెప్పలేక తల్లిదండ్రులు సతమతమవుతున్నారు. ఒకవేళ బదిలీ ఆలస్యమైతే ఇప్పటికే తాము ప్రస్తుతం ఉన్న ప్రాంతంలోని స్కూల్‌లో చేర్పించిన పిల్లలను విద్యా సంవత్సరం మధ్యలో వేరే చోటికి తరలించడం ఇబ్బందిగా మారుతుందని ఆందోళన వ్యక్తమవుతోంది. పలు కార్పొరేట్ కళాశాలల్లో చదివే పిల్లలను మధ్యలో వేరే చోటికి తీసుకెళ్తే ఫీజులు వెనక్కు తిరిగి ఇవ్వడానికి తీవ్రంగా ఇబ్బంది పెట్టే పరిస్థితి ఉంది. ఒకవేళ వారి బ్రాంచి ఆ ఊర్లో ఉంటే కొద్దిగా ఊపిరి పీల్చుకున్నట్లే. లేకపోతే తిప్పలు తప్పవు. ఈ నేపథ్యంలో రిక్వెస్టులు పెట్టుకున్న పోలీసులు బదిలీల ఆదేశాల(డీవో) కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లాలో సుమారు 130 మంది వరకూ బదిలీకోసం వినతి సమర్పించగా.. దాదాపు 80 మంది అర్హత ఉన్న వారిగా తెలుస్తోంది. వీళ్లందరూ డీవోల కోసం వేచి చూస్తున్నారు. ముఖ్యంగా పిల్లలను స్కూల్‌లో చేర్చే విషయంలో తర్జనభర్జన పడుతున్నారు. భార్యాభర్తలు వేర్వేరు చోట్ల పని చేసే వాళ్లు, పెద్ద వాళ్లకు ఆరోగ్య సమస్యలు ఉన్నవారు పిల్లల చదువుల విషయంలో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో డీవోలు తాము కోరుకున్నట్లు వస్తే ఆ సమస్య కూడా తీరుతుందని ఆశ పడుతున్నారు. అర్జీలు పెట్టుకున్న వాళ్లే కాకుండా ఐదేళ్లకు మించి ఒకచోట పాతుకుపోయిన వాళ్లపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం కనిపిస్తోంది. ఒకచోట డీవో ఉన్నా తాము కోరుకున్న చోట ఏళ్ల తరబడి పాతుకుపోయి వాళ్లూ ఉన్నారు. ఆయా సీట్లలోకి వచ్చే అధికారులను ప్రసన్నం చేసుకొని పబ్బం గడుపుకొంటున్నారు. సదరు అధికారులను 'పక్కదోవ' పట్టించడంలో కీలకంగా వ్యవహరిస్తూ అన్నీ తామై 'చక్కబెడుతున్నారనే' ఆరోపణలు ఉండగా, వారిపై ఓ కన్నేసి ఉంచాల్సి ఉంది.


మంత్రి దుర్గేష్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

గోదావరి టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు

రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్

కడియం, జూన్ 26: గోదావరి ప్రాంతం అందాలకు నిలయమని, అందుకే ఈ ప్రాంత అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు. కడియం మండలం బుర్రిలంక పాటంశెట్టి సుబ్బారావు-శివరామ నర్సరీకి మంత్రి దుర్గేష్ విచ్చేశారు. జనసేన నాయకులు, జనసైనికులు దుర్గేష్‌కు ఘనస్వాగతం పలికారు. మంత్రి హోదాలో తొలిసారిగా బుర్రిలంక విచ్చేసిన దుర్గేష్ స్థానిక విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం పర్యాటకరంగాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. గోదావరి జిల్లాల్లో పర్యాటకులను ఆకట్టుకునేవిధంగా అనేక రమణీయ ప్రాంతాలు ఉన్నాయన్నారు. ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం, హెరిటేజ్ టూరిజం, హేవలాక్ బ్రిడ్జిలను అనుసంధానం చేస్తూ అద్భుతంగా సర్క్యూట్ టూరిజంగా అభివృద్ధి చేస్తామన్నారు. కడియపులంకలో మధ్యలో నిలిచిపోయిన ఎకో-టూరిజం భవనం పునః నిర్మిస్తామన్నారు. హేవలాక్ వంతెన సుందరీకరణ, పిచ్చికలంక పర్యాటక అభివృద్ధికి కృషిచేస్తామని మంత్రి దుర్గేష్ తెలిపారు. గత ప్రభుత్వంలో రుషికొండను విచ్ఛిన్నం చేసి కోట్లాది రూపాయల దుర్వినియోగం చేసి విలాసవంతమైన భవనాలను నిర్మించారన్నారు. గత ప్రభుత్వం పర్యాటక రంగ అభివృద్ధికి ఏ మాత్రం ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. చివరకు కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలకు జలజీవన్ మిషన్ ద్వారా తాగునీటి సరఫరాకు కోట్లాది రూపాయలు కేటాయిస్తే వాటిని కూడా మళ్లించి ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయేలా గత ప్రభుత్వం చేసిందన్నారు. గ్రామ పంచాయతీలకు కేటాయించిన కేంద్ర నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం వాడేసుకుందన్నారు. అందుకే జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ గ్రామ పంచాయతీ, గ్రామీణాభివృద్ధి వంటి శాఖలు తీసుకుని రూరల్ ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పాటంశెట్టి సూర్యచంద్రరావు, వెలుగుబంటి ప్రసాద్, గట్టి నర్సయ్య, మార్గాని సత్యనారాయణ, అన్నందేవుల చంటి, వెలుగుబంటి నాని, ముద్రగడ జమీ, పాటంశెట్టి రాంజీ, రత్నం అయ్యప్ప, చెక్కపల్లి మురళి, బోడపాటి గోపి, మల్లు పోలరాజు, గెడ్డం శివ, ఆదిమూలం సాయి, మార్గాని ఏడుకొండలు, బొర్సు సుబ్రహ్మణ్యం, విత్తనాల సాయి, జంగా వినోద్, నాగిరెడ్డి రామకృష్ణ, గాజుల రత్తయ్య, కర్రి చినబాబు, పాటంశెట్టి వాసు, జనసైనికులు, నర్సరీ రైతులు ఉన్నారు. అనంతరం కడియపులంక అభయాంజనేయస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పల్ల సుబ్రహ్మణ్యం, మల్లు శివ పాల్గొన్నారు.

ఇంటర్ మొదటి ఏడాది సప్లిమెంటరీలో జిల్లాకు 17వ స్థానం

రాజమహేంద్రవరం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఇంటర్ మొదటి ఏడాది సప్లిమెంటరీ (నాన్ ఇంప్రూవ్‌డ్) పరీక్షల్లో తూర్పుగోదావరి జిల్లా 41 శాతంతో 17వ స్థానంలో నిలిచింది. మొత్తం 4125 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 1689 మంది, ఒకేషనల్‌లో 510కి 226 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. షార్ట్ మార్క్స్ మెమోలు వచ్చేనెల ఒకటి నుంచి https://resultsbie.ap.gov.in వెబ్‌సైటులో అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. అలాగే రీ-వెరిఫికేషన్ కోసం సబ్జెక్టుకు రూ.వెయ్యి చెల్లించి ఈనెల 28 నుంచి వచ్చే నెల 4 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు గత నెల 24 నుంచి ఈ నెల 1 వరకూ జరిగిన విషయం తెలిసిందే.

పది సప్లిమెంటరీలో 10వ స్థానంలో తూర్పుగోదావరి

రాజమహేంద్రవరం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బుధవారం విడుదల చేసిన పదో తరగతి అడ్వాన్సుడు సప్లిమెంటరీ పరీక్షల్లో జిల్లా 10వ స్థానంలో నిలవగా.. బాలురు పైచేయి సాధించారు. జిల్లాలో బాలురు 3473 మంది పరీక్ష రాయగా 2649(76.27%)మంది, బాలికలు 2275 మందికిగాను 1810(79.56) మంది.. మొత్తం 5748 మంది విద్యార్థులకు 4459(77.57%) మంది ఉత్తీర్ణత సాధించారు. ఫలితాలు www.bse.ap.gov.in వెబ్‌సైటులో అందుబాటులో ఉంచామని అధికారులు పేర్కొన్నారు. ఈనెల 27 నుంచి వచ్చే నెల 1న రాత్రి 11 గంటల వరకూ రీ-కౌంటింగ్, రీ-వెరిఫికేషన్‌కి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సీఎఫ్ఎంఎస్ సిటిజన్ చలాన్ ద్వారా ఫీజు చెల్లించవచ్చని, రీకౌంటింగ్‌కి ఒక్కో సబ్జెక్టుకు రూ.500, రీ-వెరిఫికేషన్‌కి రూ.వెయ్యి చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు.


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

అందుబాటులో లేకపోతే కాల్ చేయండి : ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): 'ఆకతాయిలు, బ్లేడ్, గంజాయి బ్యాచ్‌ల వల్ల ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా నాయకులు అందుబాటులో ఉంటారు. వారు సరైన రీతిలో స్పందించకపోతే నా సెల్ నెం.9866317039కి ఫోన్ చెయ్యండి. ఎప్పుడూ అందుబాటులో ఉంటాను. పోలీసుల ద్వారా తగిన చర్యలు తీసుకుంటా' అని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. క్షేమ సమాచారాల కోసం ఫోన్ చేసి సమయం వృథా చేయకుండా ఇబ్బందులు ఎదురైతే తప్పకుండా ఫోన్ చేయాలని స్పష్టంచేశారు. సోమాలమ్మ ఆలయం సమీపంలో నిర్వహించిన 'మీభద్రత మా బాధ్యత' కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసం 'మీ భద్రత మా బాధ్యత'ను ప్రారంభించామన్నారు. బ్లేడ్‌బ్యాచ్, గంజాయి, ఆకతాయిల ఆగడాలను అరికట్టడం వంటి అంశాలు ఈ కార్యక్రమానికి ముడిపడి ఉన్నాయన్నారు. సీఐ వి.పుల్లారావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశీనవీన్, నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు, శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనరు కుడుపూడి సత్తిబాబు, మాలే విజయలక్ష్మి పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో డయేరియా కేసులు నమోదు

ఏడు కేసులు, మూడు డిశ్చార్జి, 4 కేసులకు ట్రీట్‌మెంట్

ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి : హెచ్‌వోడీ

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 26 : రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో మొత్తం ఏడు డయేరియా కేసులు నమోదయ్యాయి. వీటిలో మూడు కేసులకు ఆసుపత్రి వైద్యులు మెరుగైన వైద్యసేవలందించడంతో కోలుకోగా డిశ్చార్జి చేశారు. ప్రస్తుతం నాలుగు కేసులకు చికిత్స అందిస్తున్నారు. వీరంతా మహిళలే. డయేరియా విషయంలో అప్రమత్తంగా ఉండాలంటూ ప్రభుత్వం ఇప్పటికే ముందస్తు హెచ్చరికలు, ఆదేశాలు జారీచేయడంతో అప్రమత్తమైన జీజీహెచ్ అధికారులు డయేరియా కేసులకు చికిత్స అందించడానికి ప్రత్యేకంగా ఒక వార్డును ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం సిటీ పరిధిలో మూడు కేసులు నమోదు కాగా వీరిలో సీటీఆర్ఐ ప్రాంతానికి చెందిన 40 ఏళ్ల మహిళ ఒకరున్నారు. ఈమె ఈనెల 23న జీజీహెచ్‌లో చేరారు. మరో ఇద్దరు మహిళలు 24, 26 తేదీల్లో చేరారు. గండేపల్లి పీహెచ్‌సీ నుంచి 45 ఏళ్ల ఒక మహిళను అనుమానిత లక్షణాలతో జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. రాజవోలుకు చెందిన 53 ఏళ్ల వ్యక్తి కోలుకోవడంతో అతన్ని డిశ్చార్జి చేశారు. మరొకరు కొంతమూరు ప్రాంతానికి చెందిన వ్యక్తి అని సమాచారం. ఈ నేపథ్యంలో డయేరియా కేసుల కోసం జీజీహెచ్ మెడికల్ యూనిట్ సమీపంలో ప్రత్యేకంగా మేల్/ఫిమేల్ వార్డును ఏర్పాటుచేశారు. జీజీహెచ్ జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ పర్యవేక్షణలో బాధితులకు వైద్యులు, వైద్య సిబ్బంది చికిత్స అందిస్తున్నారు. అయితే డయేరియా ప్రత్యేక వార్డులో వైద్య సిబ్బంది కొరత ఉందని చెబుతున్నారు. స్టాఫ్‌నర్సు, ఇతర నర్సింగ్ స్టాఫ్ అవసరమైనమేరకు లేకపోవడంతో వైద్యసేవలకు విఘాతం కలుగుతున్నదనే విమర్శలున్నాయి.

వాతావరణంలో అనూహ్య మార్పులతోనే డయేరియా

వాతావరణ పరిస్థితుల్లో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నందున ప్రజలు తగిన ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని జీజీహెచ్ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగడంతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ముఖ్యమని తెలిపారు. వేడివేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యమని సూచించారు. డయేరియా చికిత్సకు అవసరమైన మందులన్నీ అందుబాటులో ఉన్నాయని, ఏవైనా అనుమానిత లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలని కోరారు.


ర్యాలీలో పాల్గొన్న జిల్లా ఎస్పీ జగదీశ్, ఇతర పోలీసు అధికారులు

దేశ భవిష్యత్తును కుంగదీసే.. మాదక ద్రవ్యాలను అరికడదాం

మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీలో జిల్లా ఎస్పీ జగదీశ్

రాజమహేంద్రవరం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): యువత జీవితాలను సర్వనాశనం చేస్తూ దేశ భవిష్యత్తును కుంగదీస్తున్న మాదకద్రవ్యాల (డ్రగ్స్)ను అరికట్టడాన్ని సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని ఎస్పీ జగదీశ్ పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వాటివల్ల కలిగే దుష్ప్రభావాలను నినదిస్తూ పోలీసులు, కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల సామాజికంగా చులకనవుతారన్నారు. ఇంట్లో పెద్దవాళ్లు కూడా తలదించుకోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. మానసిక, శారీరక అనారోగ్యాల బారినపడి జీవితం నాశనమవుతుందని చెప్పారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాలు అమ్మకం, వినియోగం, నిల్వలపై పోలీసులకు సమాచారం ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. దగ్గరలోని పోలీసులకు లేదా తనకు నేరుగా సమాచారం ఇవ్వవచ్చని చెప్పారు. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయం అందించాలని కోరారు. జిల్లాలో యువత మాదకద్రవ్యాల బారినపడకుండా అన్ని పాఠశాలలు, కళాశాలల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు వాటి వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరిస్తూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశామన్నారు. అవగాహనా ర్యాలీలో అడిషనల్ ఎస్పీ(ఎస్ఈబీ) పి.సోమశేఖర్, డీఎస్పీలు విజయ్‌పాల్, అంబికా ప్రసాద్, త్రీటౌన్ సీఐ ప్రసన్న వీరయ్యగౌడ్ పాల్గొన్నారు.


రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాల రైతుబజార్‌లో సబ్సిడీ టమాటా విక్రయాలను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ తేజ్‌భరత్

టమాటా ధరల దూకుడుకు చెక్

రైతుబజార్లలో సబ్సిడీపై కిలో రూ.50, కుటుంబానికి రెండు కిలోలు.. విక్రయం ప్రారంభించిన జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 26: రోజురోజుకూ పెరిగిపోతున్న టమాటా ధరలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా జిల్లాలోని ఆరు రైతుబజార్ల ద్వారా సబ్సిడీ ధరలకే గ్రేడ్1 టమాటాలను విక్రయించాలని అధికార యంత్రాంగం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు బుధవారం జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల రైతుబజార్‌లో టమాటా అమ్మకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తేజ్‌భరత్ మాట్లాడుతూ జిల్లాలో ధరల నియంత్రణ కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతున్నదన్నారు. ప్రభుత్వ ఆదేశాలమేరకు రైతుబజార్ల ద్వారా కిలో రూ.50లకే ప్రతి కుటుంబానికి రెండు కిలోల టమాటాలను విక్రయాన్ని అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. రాజమహేంద్రవరంలో ఐదు, కొవ్వూరులో ఒక రైతుబజారులో సబ్సిడీపై టమాటాలను విక్రయించనున్నామని తెలిపారు. పుంగనూరు నుంచి ఐదు మెట్రిక్ టన్నుల టమాటాలను జిల్లాకు దిగుమతి చేసుకున్నామన్నారు. ప్రతి రెండు రోజులకు ఒకసారి పరిస్థితిని సమీక్షించి టమాటాలను సరఫరా చేసే ప్రాంతాలను గుర్తించి ఆ మేరకు సరుకును తీసుకురావడం జరుగుతుందన్నారు. మార్కెటింగ్ ఏడీఎం సునీల్‌కుమార్, రైతు బజార్ల ఎస్టేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పైపులైన్ పేలడంతో ఏర్పడిన గొయ్యి







ఎగసిపడుతున్న అగ్నికీలలు(ఫైల్‌ఫోటో)

గెయిల్ పైపులైన్ పేలుడు జరిగి నేటికి పదేళ్లు

బాధిత కుటుంబాలకు నేటికీ పూర్తిస్థాయిలో జరగని న్యాయం

మామిడికుదురు, జూన్ 26: 2014 జూన్ 27. ఆ రోజు తెల్లవారుజామున డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం నగరం గ్రామంలో భారీ విస్ఫోటనం సంభవించింది. ఏమి జరిగిందో తెలిసే లోపలే 22 మంది సజీవదహనమయ్యారు. గెయిల్ సంస్థకు చెందిన ట్రంక్ పైపులైన్ పేలడంతో ఒక్కసారిగా అగ్నికీలలు చుట్టిముట్టి 22 మందిని పొట్టన పెట్టుకోవడమే గాక పలువురిని గాయాలపాల్జేసింది. ఈ దుర్ఘటన జరిగి నేటికి పదేళ్లు పూర్తవుతోంది. ఆనాటి విషాదాన్ని గుర్తుచేసుకుంటూ నగరం గ్రామవాసులు భయాందోళనకు గురవుతున్నారు. గెయిల్ పైపులైన్ విస్ఫోటనం తర్వాత అప్పట్లో ప్రభుత్వం, అధికారులు ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని బాధితులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నగరం గ్రామాన్ని దత్తత తీసుకుని సకల సౌకర్యాలు కల్పించి మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దుతామని ఇచ్చిన హామీలు ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదు. గ్రామంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తామని, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు, ఇంటింటికీ తాగునీరు, వంట గ్యాస్ ఉచితంగా ఇస్తామని.. ఇలా పదుల సంఖ్యలో ఇచ్చిన హామీలు పదేళ్లు కావస్తున్నా అమలు కాలేదని ఈ ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రభుత్వం స్పందించి గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు గెయిల్ సంస్థ నుంచి నిధులు రాబట్టేలా చర్యలు తీసుకోవాలని నగరం దీవి ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

సాహితీవేత్త 'రేకపల్లి' కన్నుమూత



రేకపల్లి శ్రీనివాసమూర్తి

అమలాపురం టౌన్, జూన్ 26: సీనియర్ న్యాయవాదిగా సేవలు అందిస్తూనే సంగీత, సాహిత్య రంగాలకు ఎనలేని సేవలు అందించిన రేకపల్లి శ్రీనివాసమూర్తి (81) బుధవారం ఉదయం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని ఆయన స్వగృహంలో కన్నుమూశారు. వృద్ధాప్యంతో పాటు కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. సంగీతంపై ఉన్న మక్కువతో శ్రీభారతి గానసభను స్థాపించడమే కాకుండా మంగళంపల్లి బాలమురళీకృష్ణ, చిట్టిబాబు వంటి మహామహులతో అమలాపురంలో సంగీత కచేరీలు నిర్వహించారు. సాహితీ రంగంపై మక్కువతో సాహితీ మిత్రమండలిని స్థాపించి యద్రాప్రగడ రామకృష్ణ, పోచినపెద్ది కామసత్యనారాయణ వంటి ప్రముఖులెందరినో సత్కరించారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడిగా, ఆలిండియా రేడియో ఆర్టిస్టుగా, సంస్కార భారతి పూర్వ అధ్యక్షుడిగా... విశేష సేవలు అందించారు. ఎందరినో కవులుగా తీర్చిదిద్ది మరెందరినో ప్రోత్సహించారు. శ్రీనివాసమూర్తికి భార్య మహాలక్ష్మి, కుమార్తె ఫణి, కుమారుడు కృష్ణ ఉన్నారు. పిల్లలిద్దరూ అమెరికాలో స్థిరపడ్డారు. ఈశ్వరునిపై ఎనలేని భక్తితో 70కు పైగా భక్తి శతకాలను రాసిన ఘనత రేకపల్లికే దక్కుతుంది. రేకపల్లి మృతి సంగీత, సాహితీ రంగాలకు తీరని లోటని డాక్టర్ గోదశి గంగరాజు, డాక్టర్ కొప్పిశెట్టి వెంకటరమణకుమార్, బులుసు జగదీష్, కాంబాబు, పుత్సా కృష్ణ కామేశ్వర్, నల్లా నరసింహమూర్తి, మాడా రాము, జాన మల్లికార్జున రావు నివాళులర్పించారు.

ఎనీమియా ముక్త భారత్ అమలుపై కేంద్ర బృందం ఆరా

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 26 :జిల్లాలో ఎనీమియా ముక్తి భారత్ అమలుపై కేంద్ర బృందం సభ్యులు జితేంద్ర సింగ్, ఎస్ పూజ క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. బుధవారం జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బొమ్మూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో జరిగిన సమీక్షలో జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడారు. రక్తహీనత నివారణే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రజలు బలవర్ధకమైన ఆహారం అంటే ఆకుకూరలు, కాయగూరలు, బెల్లం, పప్పు దినుసులు వంటివి తీసుకోవడం వల్ల హిమోగ్లోబిన్ శాతం పెరిగి తద్వారా రక్తహీనత అధిగమించవచ్చునని తెలిపారు. జిల్లాలో కేంద్ర బృందం సభ్యులు జితేంద్ర సింగ్, ఎస్.పూజ పాలచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోను, అంగన్వాడీ సెంటర్‌ను పరిశీలన చేసి అక్కడ పిల్లలకు అందించే ఐరన్ ఫోలిక్ యాసిడ్ గురించి ఆరా తీశారు. అంగన్వాడీ సెంటర్‌లో ఐదేళ్ల లోపు పిల్లలకు వారానికి రెండు సార్లు ఇచ్చే ఐఎఫ్ఏ సిరప్‌లు గురించి తెలుసుకున్నారు. అదే విధంగా శాటిలైట్ సిటీ-3 లో ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్ లో, అంగన్వాడీలో అమలవుతున్న కార్యక్రమాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.రాజకుమారి, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ మౌనిక ,బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరి చంద్ర ప్రసాద్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'పవన్ దృష్టికి సమస్యలు తీసుకెళ్తాం'

రంపచోడవరం, జూన్ 26: గిరిజన గురుకుల విద్యాలయాల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని గురుకుల విద్యాలయాల నాన్ టీచింగ్ యూనియన్ నాయకుడు మాదే రామచంద్రరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉప ముఖ్యమంత్రి జూలై 1 నుంచి 3వ తేదీ వరకు పిఠాపురంలో అందుబాటులో ఉంటారని వారి దృష్టికి సమస్యలను తీసుకెళ్లాలన్నారు. 010 పద్దును 10వ షెడ్యూల్లో ఉన్న గిరిజన గురుకులం, గురుకులాలకు వర్తింపజేయాలని, గురుకుల విద్యాలయాల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైంస్కేల్, గత 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయ జూనియర్ లెక్చరర్లకు జీతాల పెంపుదల తదితర సమస్యలు రాష్ట్ర అధ్యక్షుడు హరి, జిల్లా అధ్యక్షుడు సూర్యారావు అధ్వర్యంలో విన్నవించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు.

ద్రాక్షారామ భీమేశ్వర ఆలయంలో అవినీతిపై

విజిలెన్స్ విచారణ



బహిరంగ విచారణ నిర్వహిస్తున్న మంత్రి సుభాష్

> మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రకటన
> ఆలయం వద్ద మంత్రి సుభాష్ ఆధ్వర్యంలో బహిరంగ విచారణ
> మాజీ మంత్రి వేణు హయాంలో జరిగిన అవకతవకలను వివరించిన పలువురు భక్తులు
> చందాలతో రథం తయారీ.. కానీ శిలాఫలకంపై మాజీ మంత్రి వేణు పేరు..

ద్రాక్షారామ, జూన్ 26: ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో జరిగిన అవినీతి కార్యకలాపాలకు సంబంధించి వచ్చిన ఆరోపణలపై విజిలెన్స్ విచారణకు ఆదేశించినట్లు కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ బుధవారం ప్రకటించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామ భీమేశ్వరాలయం వద్ద బుధవారం అవినీతి ఆరోపణలకు సంబంధించి బహిరంగ విచారణ జరిగిది. ఆలయ ఈవో పి.టి.వి సత్యనారాయణ సమక్షంలో నిర్వహించిన బహిరంగ విచారణలో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి.

భక్తులు చందాలు ఏమైనట్లు?

భీమేశ్వర స్వామివారి రథం తయారీపై వచ్చిన ఆరోపణలపై విచారించారు. రథం తయారీకి అర్చకులు రూ.30 లక్షలు వరకు భక్తుల నుంచి చందాలు వసూలు చేసి ఇచ్చినట్లు తెలపగా మాజీ మంత్రి వేణు రథం తయారు చేయించినట్లు శిలాఫలకం వేయడం, తదుపరి భక్తులు గొడవ చేయగా శిలాఫలకం మార్చి మరో శిలాఫలకం పెట్టడంపై మంత్రి సుభాష్ ఈవోను నిలదీశారు. భక్తుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసినట్లు భక్తులు చెప్పారు.

మాజీ మంత్రి ఇంటికి ఆలయం నుంచి ఆహార పదార్థాలు

మాజీ మంత్రి వేణు ఇంటిలో ఎటువంటి కార్యక్రమాలు జరిగినా ఆలయం నుంచి ఆహారపదార్థాలు వండి పంపించారన్న ఆరోపణలపై ఆలయంలో వంటమనిషిని పిలిపించి మాట్లాడారు. వంటలు చేసే రాఘవేంద్రస్వామి చాలాసార్లు వంటలు వండి పంపించామని మంత్రి సుభాష్ ఎదుట తేల్చిచెప్పారు. అదే విధంగా ఆలయ ప్రాంగణంలో షాపుల యజమానుల వద్ద లీజు పొడిగింపునకు షాపుకు రూ.5 వేలు చొప్పున వసూలు చేసినట్లు షాపుల యజమానులు మంత్రి ఎదుట స్పష్టం చేశారు. అలాగే ఆలయంలో పార్కింగ్ స్థలంలో వాహనాలు పార్కింగ్ పాటదారులు భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారని భక్తులు ఆరోపణలు చేశారు. అదే విధంగా ఆలయంలో వివాహాలు చేసుకునే సామాన్యుల నుండి నిర్దేశించిన మొత్తం కాకుండా వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఈవో పట్టించుకోలేదని ఆళ్లబుజ్జి ఆరోపించారు. కనీసం బోర్డులు కూడా పెట్టలేదన్నారు. గతంలో వివాహాలు ఆలయంలో జరిగేవని వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత బాహ్యప్రాంగణంలో చేసుకోవాలని ఆదేశాలు ఇచ్చారని మంత్రి దృష్టికి భక్తులు తీసుకువెళ్లారు.

సప్తగోదావరి అభివృద్ధి పనుల్లో అవినీతి

అదే విధంగా సప్తగోదావరి అభివృద్ధి పనుల్లో కూడా అవినీతి చోటు చేసుకుందని ఉపాధి హామీ పథకంలో పనులు చేసి ప్రభుత్వం నుంచి కూడా నిధులు డ్రా చేశారని పలువురు ఆరోపించారు. మాజీ మంత్రి వేణు ఆలయానికి వస్తే భక్తులకు దర్శనాలు నిలిపివేశారని భక్తులు ఆరోపించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు హయాంలో కూడా ఇలా జరగలేదన్నారు. దీనిపై మంత్రి సుభాష్ మాట్లాడుతూ ఇక పై తనకు కూడా ప్రోటోకాల్ వద్దని సామన్య భక్తులకు దర్శనాలు కల్పించడమే ప్రధానమన్నారు. అదే విధంగా జనరేటర్ డీజిల్ సొంత వాహనాలకు వాడుకున్నారని, ఆలయ వసతి గృహాలు వాడుకున్నారని, ప్రసాదం పంపిణీ, పూల అలంకరణ, డ్రైఫూట్స్ కొనుగోళ్లలో అవినీతి జరిగిందని ఆరోపణలు చేశారు. మాజీ మంత్రి వేణు అనుచరులు ఇద్దరు వలంటీర్లకు ఆలయంలో అవుట్‌సోర్సింగ్‌లో ఉద్యోగాలు కల్పించి రెండు చోట్లా వేతనాలు చెల్లిస్తున్నట్లు తేల్చారు. వీరిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. వీటిపై మంత్రి సుభాష్ మాట్లాడుతూ విజిలెన్స్ అధికారులు అన్నీ తేలుస్తారని ఆలయంలో కొంతమంది ఉద్యోగులు సస్పెండ్ అవుతారని అన్నారు.

ఆలయంలో భారీ అవినీతి: మంత్రి సుభాష్

భీమేశ్వరాలయంలో వైసీపీ ప్రభుత్వంలో మాజీ మంత్రి వేణు హయాంలో భారీ అవినీతి చోటు చేసుకుందని మంత్రి సుభాష్ అన్నారు. బహిరంగ విచారణ అనంతరం విలేకరులతో మంత్రి మాట్లాడారు. రథం తయారీలో లక్షలాది రూపాయలు వసూలు చేశారని తేలిందన్నారు. శిలా ఫలకాలు పెట్టి తొలగించడం సాక్ష్యాధారాలతో సహా దొరికాయన్నారు. ప్రోటోకాల్ పేరుతో భక్తులకు గంటలు గంటలు దర్శనం జరగకుండా చేశారన్నారు. జనరేటర్లు అమ్మేసుకున్నట్లు తేలిందన్నారు. మొత్తం వ్యవహారాలపై విజిలెన్స్ విచారణకు ఆదేశించామన్నారు. టీడీపీ నాయకులు దొంగల శ్రీధర్, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, చోడిశెట్టి శివాజీ అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. అంతకు ముందు మంత్రి సుభాష్ భీమేశ్వరస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో సప్తగోదావరి, వసతి గృహాలను పరిశీలించారు.

చెత్తకుప్పల్లో ఆధార్ కార్డులు..పోస్టల్ నిర్లక్ష్యంపై విమర్శలు



చెత్త కుప్పల్లో కార్డులు

సర్పవరం జంక్షన్, జూన్ 26: ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆధార్ కార్డు తప్పనిసరి. ఎలాంటి దరఖాస్తు చేయాలన్నా..ప్రభుత్వ తదితర పథకాలు అందాలన్నా ఇదే కీలకం. అంతటి ప్రాధాన్యత కలిగిన ఆధార్ కార్డులు కస్టమర్ల చేతికి బట్వాడా చేయాల్సిన పోస్టల్ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చెత్తకుప్పల్లో ఆధార్ కార్డులు దర్శనమివ్వడమే దానికి నిదర్శనం. చెత్తసేకరించేందుకు విచ్చేసిన పారిశుధ్య కార్మికుల కంట పడటంతో పోస్టల్‌శాఖ సిబ్బంది నిర్వాకం బయటపడింది. వివరాల్లోకెళితే కాకినాడ రూరల్ మండలం సర్పవరం మహారాష్ట బ్యాంకు వీధిలో పోస్టాఫీసు బ్రాంచి కార్యాలయం ఉంది. ఆఫీసు బయట ఫైబర్ డస్ట్‌బిన్‌లో ఉన్న చెత్తా, వ్యర్థాలను సేకరించేందుకు బుధవారం ఉదయం సర్పవరం గ్రామ పంచాయతీకి చెందిన శానిటేషన్ వర్కర్లు వచ్చారు. డస్ట్‌బిన్‌లో ఉన్న వ్యర్థాలు బయటకు తీసి ట్రాక్టర్ లోకి లోడ్ చేసే క్రమంలో అటుగా వెళుతోన్న స్థానికుడు ఎల్ఎస్ వీరభద్రరాజు గుర్తించి ఒరిజినల్ ఆధార్‌కార్డులుగా పరిశీలించి ఈ విషయాన్ని పోస్ట్‌మాస్టర్ సత్యనారాయణకు సమాచారం అందించారు. ఆయన తక్షణమే అక్కడకు వచ్చి ఆధార్‌కార్డులను పరిశీలించి, వెనక్కి తీసుకెళ్లి సంబంధిత కస్టమర్లకు పంపిణీ చేయించడంతో సమస్య సద్దుమణిగింది. ఈ విషయమై పోస్ట్‌మాస్టర్ సత్యనారాయణను వివరణ కోరగా రెండ్రోజుల కిందట తమ పోస్టాఫీసులో యాన్యువల్ ఇన్‌స్పెక్షన్ జరిగిందని, కార్యాలయం అంతా క్లీనింగ్ చేయించి, ఆధార్‌కార్డులు, ఇతర పత్రాలను ఒకచోట పెట్టగా పొరపాటున స్వీపర్ వీటిని తీసుకెళ్లి డస్ట్‌బిన్‌లో వేశారన్నారు. పోస్టల్ శాఖ అధికారులు,సిబ్బంది నిర్లక్ష్యవైఖరితో విలువైన ఆధార్‌కార్డులు చెత్తకుప్పలు పాలయితై తమ పరిస్థితి ఏంటని కస్టమర్లు ప్రశ్నించారు. పోస్టల్ సిబ్బంది నిర్లక్ష్య వైఖరిపై ఆ శాఖ ఉన్నతాధికారులు విచారణ నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కాకినాడలో రెండు రోజులు

మంత్రి నాదెండ్ల పర్యటన



కాకినాడ సిటీ, జూన్ 26: రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈనెల 28,29 తేదీల్లో కాకినాడలో పర్యటించనున్నారు. 28వతేదీ ఉదయం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, పౌరసరఫరాల సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులతో ప్రజా పంపిణీ వ్యవస్థ పనితీరుపై సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీ ద్వారా రేషన్‌బియ్యం పంపిణీని పరిశీలించనున్నారు. 29వతేదీ ఉదయం రేషన్ డీలర్లు, ఎండీయూ వాహనదారులు, కార్డుదారులతో సమావేశం జరపనున్నారు. జిల్లాలో రబీ సీజన్‌లో చేపట్టిన ధాన్యం సేకరణ, కనీస మద్దతు ధర చెల్లింపు తదితర అంశాలపై ఆయా శాఖల సంబంధిత అధికారులు, రైతులతో మంత్రి నాదెండ్ల మనోహర్ సమావేశం నిర్వహిస్తారు. ఈ మేరకు రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ వైస్‌ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జి.వీరపాండియన్ సర్క్యులర్ జారీ చేశారు.

సెల్‌ఫోన్ల రికవరీ

రాజమహేంద్రవరం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్(సీఈఐఆర్) సహాయంతో చోరీకి గురైన 13 సెల్‌ఫోన్లు రికవరీ చేసి ఫిర్యాదుదారులకు అందజేశామని ప్రభుత్వ రైల్వే పోలీస్(జీఆర్పీ) సీఐ పి.విజయశంకర్ తెలిపారు. వాటి విలువ సుమారు రూ.1 లక్షా 35 వేలు ఉంటుందన్నారు. సీఈఐఆర్ ద్వారా ఇప్పటివరకూ మొత్తం 33 సెల్‌ఫోన్లు రికవరీ చేశామన్నారు. చోరీకి గురైన ఫోన్లు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉండగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వాటిని రప్పించామన్నారు. ప్రయాణికులు సీఈఐఆర్ పోర్టల్ వినియోగించుకోవాలని ఆయన సూచించారు. దర్యాప్తులో ప్రతిభ చూపిన సీఐ విజయ్‌శంకర్, ఎస్ఐలు మావుళ్లు, లోవరాజు సిబ్బందిని డీఎస్ఆర్పీ ఎల్.మోహనరావు అభినందించారు.

4 నుంచి మరిడమ్మ జాతర ఉత్సవాలు



వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

పెద్దాపురం, జూన్ 26: వచ్చే నెల 4 నుంచి ప్రారంభమయ్యే మరిడమ్మ జాతర మహోత్సవాలను విజయవంతం చేయాలని ఆర్డీవో జె.సీతారామారావు కోరారు. పెద్దాపురం మరిడమ్మ దేవస్థానంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు ఆధ్వర్యంలో జాతర నిర్వహణ ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని బుధవారం మాట్లాడారు. జాతరకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. సుమారు 37 రోజులపాటు జరిగే ఈ జాతర మహోత్సవాలకు వేలాదిగా భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ జాతర మహోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్, వైద్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

బావిలో బిహార్ వాసి మృతదేహం



శర్మ.. ఫైల్‌ఫోటో



మృతదేహాన్ని వెలికితీస్తున్న సిబ్బంది

తుని రూరల్, జూన్ 26: కాకినాడ జిల్లా తుని పట్టణం రాణి సుభద్రయమ్మ పేట వద్ద బావిలో మృతదేహం కలకలం రేపింది. బిహార్‌కి చెందిన ఉత్తంకుమార్ శర్మ(39)తునిలోని ఒక హోటల్‌లో వంట మేస్త్రిగా పని చేస్తున్నాడు. కొన్ని రోజులుగా అతను కనబడకపోవడంతో కుటుంబ సభ్యులు ఈ నెల 10న తుని పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా మిస్సయిన వ్యక్తి మృతదేహం బావిలో కనిపించింది. దీంతో పోలీసులు మృతదేహాన్ని పైకి తీయించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. శర్మకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో 'తిరుమల' ప్రతిభ

రాజమహేంద్రవరం రూరల్ జూన్26:రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్ ప్రథమ సంవత్సరం సప్లమెంటరీ ఫలితాల్లో రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరులో గల తిరుమల విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్టు విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను 468 మార్కులను ఎం.ప్రియహాసిని, సీహెచ్ హాసిని, కె.షర్మిలసాయి సాధించారని, 466 మార్కులు పైన 76 మంది 465 మార్కులు పైన 231 మంది 463 పైన 693 మంది 460 పైన 1970 మంది సాధించారన్నారు. బైపీసీ విభాగంలో షేక్ ఫాతిమున్నీసా బేగం 440కి 438 మార్కులు, 437 మార్కులు ఎ.సింగ్, ఎస్.మణి, కేఎస్ హవీలా సాధించారని, 435పైన 39 మంది, 430 పైన 172 మంది, 400 పైన 332 మంది మార్కులు సాధించారన్నారు. 99.06 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలిపారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్, ప్రిన్సిపాల్‌తో కలిసి అభినందించారు.

ఆక్వాటెక్ చాంపియన్‌షిప్ వాటర్‌పోలోకి ఎంపిక



షణ్ముఖశ్రీసాయిని అభినందిస్తున్న దృశ్యం

కాకినాడ అర్బన్, జూన్ 26: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో వచ్చేనెల 7 నుంచి 11 వరకు జరిగే 50వ నేషనల్ ఆక్వాటెక్ చాంపియన్‌షిప్ వాటర్‌పోలోకి కాకినాడకు చెందిన షణ్ముఖశ్రీసాయి ఎంపికైంది. ఈ సందర్భంగా బుధవారం డీఎస్ఏ ప్రాంగణంలో ఆమెను అభినందించారు. డీఎస్ఏ సీఈవో బి.శ్రీనివాసకుమార్, జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్‌కు చెందిన సురేష్, ఐ.రాజు, కోచ్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

విద్యార్థుల నిజాయితీ

దొరికిన సెల్‌ఫోన్‌ను పోలీసులకు అప్పగించిన వైనం



ఫోన్ అప్పగించిన విద్యార్థులు వీరే..

ఆత్రేయపురం, జూన్ 26: దొరికిన మొబైల్‌ను పోలీసులకు అప్పగించి ఐదుగురు విద్యార్థులు నిజాయితీ చాటుకున్నారు. బుధవారం ఆత్రేయపురం మహర్షి విద్యానికేతన్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులకు స్కూలు సమీపంలో మొబైల్ ఫోన్ దొరికింది. వారు నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫోన్ ఎవరిదో తెలుసుకుని అప్పగించాలని అందించారు. విద్యార్థులను ఎస్ఐ శ్రీనివాస్ అభినందించారు. అనంతరం సెల్ పోగొట్టుకున్న ఇంటర్ విద్యార్థి ధనరాజుకు మొబైల్‌ను అప్పగించారు. నిజాయితీ చాటిన విద్యార్థులను పోలీసులు అభినందించారు.

'ఎమ్మెల్యే విజయోత్సవ ర్యాలీకి అడ్డంకులా'



చెక్‌పోస్టు వద్ద పోలీసుల బందోబస్తు

రాజవొమ్మంగి జూన్ 26: రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి విజయోత్సవ ర్యాలీకి పోలీసులు అడ్డంకులు సృష్టించారని టీడీపీ శ్రేణులు ఆరోపించాయి. ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ స్వగ్రామం ఎల్లవరం వెళ్లకుండా అడ్డుకున్నారని చెప్పారు. చెక్‌పోస్టు ఏర్పాటు చేసి భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారన్నారు. నియోజకవర్గంలో ఎక్కడా లేని ఆంక్షలు ఇక్కడేమిటని టీడీపీ నేతలు పోలీసుల వైఖరిపై మండిపడ్డారు. ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారిగా నియోజకవర్గానికి రావడంతో బుధవారం పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. నియోజకవర్గమంతా సాఫీగానే విజయోత్సవ యాత్ర జరగ్గా అడ్డతీగల మండలంలోని ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ స్వగ్రామమైన ఎల్లవరం గ్రామానికి మాత్రం విజయోత్సవ ర్యాలీ వెళ్లకుండా పాపంపేట జంక్షన్‌లో పోలీసులు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. ఏ వాహనాలను చెక్ పోస్టు దాటి వెళ్లనీయలేదు. విజయోత్సవ ర్యాలీ బుధవారం ఉంటుందని ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది షెడ్యూల్ విడుదల చేశారు. అలాగే వైసీపీ నాయకులు, కార్యకర్తలతో బుధవారం మధ్యాహ్నం ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ఎల్లవరం గ్రామంలోకి విజయోత్సవ ర్యాలీ వెళ్లనీయడం లేదని టీడీపీ నాయకులు తెలిపారు. కాగా అధికార పార్టీ ఎమ్మెల్యే విజయోత్సవ ర్యాలీ ఉందని ముందస్తు సమాచారం ఇచ్చినా పోలీసులు వైసీపీ నేతల సమావేశాన్ని వాయిదా వేసుకునేలా ప్రయత్నాలు చేయకపోవడంపై టీడీపీ శ్రేణులు భగ్గుమంటున్నాయి. పోలీసులకు అనంత ఉదయభాస్కర్‌పై ఉన్న ప్రేమ ఇలా బయటపడిందని పలువురు అన్నారు.

ఆరుగురికి డయేరియా..ఆస్పత్రిలో చికిత్స



క్యాంపును పరిశీలిస్తున్న వైద్యాధికారి వెంకటేశ్వరరావు

రంగంపేట, జూన్ 26: రంగంపేట పీహెచ్‌సీ పరిధిలో గల రంగంపేట మండలం ఈలకొలను గ్రామం శివారు అచ్యుతాపురానికి చెందిన ఆరుగురికి కలుషిత తాగునీరు కారణంగా మంగళవారం రాత్రి విరోచనాలు అవ్వడంతో అస్వస్థతకు గురయ్యారని రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వేణుశ్రీలక్ష్మీ తెలిపారు. సంఘటన ప్రాంతానికి హుటాహుటిన సిబ్బందితో వెళ్లి వైద్యసేవలు అందించి, నివారణ చర్యలు చేపట్టామన్నారు. అందులో భాగంగా వాటర్‌ట్యాంక్ సంబంధిత అధికారులతో శుభ్రం చేయించి పైప్‌లైన్ వాటర్ లీకేజీలను సరిచేయించామన్నారు. జిల్లా వైద్యాధికారి కె.వెంకటేశ్వరరావు బుధవారం అచ్యుతాపురం గ్రామాన్ని సందర్శించి మెయిన్ ట్యాంక్ నుంచి తాగునీటి సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు, పంచాయతీ అధికారులకు సూచించారు. వైద్య సిబ్బంది బృందాలుగా ఏర్పడి ఇంటింటా సర్వే నిర్వహించి నివారణ చర్యలు చేపట్టాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని తెలిపారు. గ్రామంలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ప్రస్తుతం అచ్యుతాపురంలో పరిస్థితి అదుపుతో ఉందని జిల్లా వైద్యాధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయనతో పాటు రంగంపేట వైద్యులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఏజెన్సీ సమాచారం

సందడిగా ఎమ్మెల్యే శిరీషాదేవి విజయోత్సవ ర్యాలీ



విజయోత్సవ ర్యాలీలో మాట్లాడుతున్న శిరీషాదేవి

రంపచోడవరం, జూన్ 26: ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవికి ఘన స్వాగతం లభించింది. అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారిగా నియోజకవర్గానికి విచ్చేసిన ఆమెకు రంపచోడవరం నుంచి ఏజెన్సీ సరిహద్దు రాజవొమ్మంగి మండలం అనంతగిరి వరకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా నీరాజనాలు పలికారు. రంపచోడవరం మండలం ఫోక్సుపేట నుంచి ఆమెను కాన్వాయ్‌తో తీసుకువచ్చారు. తొలుత శిరీష దంపతులు సీతపల్లిలోని గడి బాపనమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఐ.పోలవరం జంక్షన్ మీదుగా రంపచోడవరం తీసుకువచ్చారు. రంపచోడవరంలో దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి, అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి పూలమాలలతో సత్కరించారు. రంపచోడవరం పుర వీధుల గుండా ప్రజలకు అభివాదం చేసి గంగవరం మండలం, అడ్డతీగల మండలాల మీదుగా రాజఒమ్మంగి చేరుకుని, అక్కడి నుంచి వారి స్వగ్రామం అనంతగిరి చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్యే బాబూరమేష్, నాయకులు, కార్యకర్తలు ఈ విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శిరీషాదేవికి ఘన స్వాగతం

మోతుగూడెం, జూన్ 26: చింతూరు మండలం మోతుగూడెంలో బుధవారం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి విజయోత్సవ ర్యాలీ ఘనంగా జరిగింది. బాసనమ్మ గుడి నుంచి రంపచోడవరం, అడ్డతీగల, గంగవరం, రాజవొమ్మంగి గ్రామాల మీదుగా ఈ ర్యాలీ జరిగింది. మోతుగూడెం ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు, డొంకరాయి ఎంపీటీసీ కె.వెంకటరమణ, టీడీపీ కార్యకర్తలు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శిరీషాదేవి విజయోత్సవ ర్యాలీ

అడ్డతీగల, జూన్ 26: అడ్డతీగలలో ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి విజయోత్సవ ర్యాలీ జరిగింది. బాణసంచా కాలుస్తూ నాయకులు, కార్యకర్తలు సందడి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీషాదేవి మాట్లాడుతూ ఏజెన్సీలో రాక్షస పాలనను అంతమొందించి తనను ఎన్నుకొన్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇక ఏజెన్సీలో రామ పాలన ప్రారంభమవుతుందని, ప్రజలకు సేవ చేయడానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో

దేవీపట్నం, జూన్ 26: మండలంలో ఇందుకూరుపేట జిల్లా పరిషత్ హైస్కూల్, ఎంపీపీఎస్ పాఠశాలను బుధవారం డీఈవో(ఎ), ఎంఈవో1 మల్లేశ్వరరావు సందర్శించారు. పాఠశాల భవన నిర్మాణాలను పరిశీలించారు. పలు రికార్డులు తనిఖీ చేశారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు ఇచ్చారు.

'నేను బడికి పోతా' కార్యక్రమం

ఎటపాక, జూన్26: ఎటపాక మండలం నెల్లిపాక గ్రామంలో బుధవారం రండి... నేను బడికిపోతా కార్యక్రమంలో భాగంగా ఉపా ధ్యాయులు, విద్యార్థుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జడ్పీ హైస్కూల్ నుంచి పలు వీధుల్లో ప్రదర్శనగా ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఎంఈవో సరియం రాజు మాట్లాడారు. గ్రామాల్లో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడుల్లో చేర్పించాలన్నారు. పిల్లల వయస్సును బట్టి తరగతుల్లో చేర్చి, ఆ తరగతి స్థాయి అందుకునేందుకు ఆ పిల్లలకు బ్రిడ్జి కోర్సును అందిస్తామన్నారు. ప్రతీ గ్రామంలో బడి బయట పిల్లలు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు, ఇతర, విద్యా ప్రోత్సాహకాలు అందిస్తామని చెప్పారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

వరరామచంద్రాపురం, జూన్ 26: యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని వీఆర్‌పురం ఎస్ఐ కె.నాగరాజు తెలిపారు. జాతీయ మత్తు మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా వీఆర్‌పురం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులతో మండల కేంద్రమైన వీఆర్‌పురం రాజీవ్ సెంటర్ నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ధూమపానం, మద్యపానం లాంటి అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. వీఆర్‌పురం పోలీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోతుగూడెంలో ర్యాలీ

మోతుగూడెం, జూన్26: అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం చింతూరు మండలం మోతుగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలో మోతుగూడెం ఎస్ఐ గోపాలరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో డీఏవీ స్కూల్ విద్యార్థులు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీ ఆర్ఎస్ఐ సుమేష్‌కుమార్, ఏఎస్ఐ రాజేశ్వరరావు, సూర్యానారాయణరావు, హెడ్ కానిస్టేబుల్ రవిచంద్రరాజు, సన్నీ, ఏపీ జెన్కో, ప్రభుత్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి దుర్గేష్‌ను కలిసిన కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 26: రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ను రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం రాజమహేంద్రవరంలోని మంత్రి నివాసంలో కమిషనర్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

రాజానగరం, జూన్ 26 : గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసమే ప్రభుత్వం పారిశుధ్య వారోత్సవాలను నిర్వహిస్తోందని రాజానగరం, చక్రద్వారబంధం సచివాలయాల కార్యదర్శులు మేకా ప్రసాద్‌బాబు, శ్రీనివాసరావులు తెలిపారు. మొక్కుబడిగా పారిశుధ్య వారోత్సవాలు పేరుతో బుధవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి పంచాయతీ కార్యదర్శులు స్పందించారు. ఆయా గ్రామాల్లోని పారిశుధ్య వారోత్సవాల్లో చేపడుతున్న పనులను వారు స్వయంగా దగ్గరుండి పర్యవేక్షించారు.

మహిళ ఆత్మహత్య విషయంలో వదంతులు వ్యాప్తి చేస్తే చర్యలు

● కొవ్వూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి



రాజమహేంద్రవరం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): నల్లజర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో అనంతపల్లి గ్రామంలో ఒక మహిళ చెదల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న కేసులో అనుమానాలు వ్యక్తపరుస్తూ వదంతులు వ్యాప్తిచేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కొవ్వూరు డీఎస్పీ కె.శ్రీనివాసమూర్తి హెచ్చరించారు. ఈ నెల 23న ఉదయం 7.30గంటల సమయంలో గ్రామానికి చెందిన మండల రాము అనే వ్యక్తి తన భార్య మండల పెద్దింట్లు తనకున్న అనారోగ్య సమస్యలవల్ల 22న ఉదయం 5గంటల ప్రాంతంలో ఇంట్లో ఉన్న చెదల మందు తాగి అపస్మారక స్థితిలో బాత్‌రూం వద్ద పడి ఉండగా బంధువులు, చుట్టుపక్కల వారు వైద్యం కోసం ఆమెను పుల్లలపాడు ఆస్పత్రికి తరలించారని చేసిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామన్నారు. మెరుగైన చికిత్స కోసం ఏలూరు ఆంధ్రా హాస్పటల్‌కి తర్వాత గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మరణించిందని ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. తానే చెదల మందు తాగినట్లు పెద్దింట్లు తెలిపిందన్నారు. ఆమె భర్తగానీ, డాక్టర్ ఇచ్చిన సమాచారంలోగానీ ఎలాంటి అనుమానం వ్యక్తం చేయలేదని డీఎస్పీ వివరించారు. బంధువులు, సాక్షుల సమక్షంలో శవపంచనామా నిర్వహించిన సమయంలో కూడా ఎలాంటి అనుమానాలూ వ్యక్తం కాలేదన్నారు. కొన్ని దిన పత్రికల్లో ఆరోపణలు వ్యక్తం చేస్తూ వార్తలు ప్రచురించారన్నారు. అలాంటి అనుమానాలను రక్తసంబంధీకులు లేదా బంధువులు, సాక్షులు వెల్లడించలేదని చెప్పారు. అనంతపల్లికి చెందిన టీడీపీ వర్గీయులు, ఇతర వ్యక్తులు, రాముపై గానీ ఎవరూ ఫిర్యాదు చేయ లేదన్నారు. ఒకవేళ ఎవరైనా ఫిర్యాదు చేస్తే దర్యాప్తు చేస్తామన్నారు. పత్రికల్లో వచ్చిన అంశాలు అవాస్తవాలని డీఎస్పీ తెలిపారు. అలాంటి వదంతులు వ్యాప్తి చేస్తే చర్యలు తప్పవన్నారు.

వాయిదాపడ్డ ఫెర్రీ వేలం పాట

సీతానగరం,జూన్ 26: పురుషోత్తపట్నం, పోలవరం ఫెర్రీ వేలపాట బుధవారం వాయిదాపడింది. పురుషోత్తపట్నం పోలవరం మధ్య నడిచే లాంచి ఫెర్రిపాట బుధవారం సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో సీతానగరం ఎంపీడీవో కెఆర్ఎస్ కృష్ణప్రసాద్, ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పోలవరం ఎంపీడీవో శ్రీను, పోలవరం ఎంపీపీ వెంకటరెడ్డిల సమక్షంలో ఫెర్రిపాట ఏర్పాటుచేశారు. మూడు టెండర్లు రాగా వాటిలో రెండు టెండర్లు నిబంధనలకు అనుకూలంగా లేకపోవడంతో ఒక్క టెండర్ తిరస్కరణకు గురైంది. దీంతో దీంతో కమిటీ వారు పాటను నిలిపివేసి వచ్చేనెల 9కు వేలపాట నిర్వహిస్తామని వాయిదా వేశారు.

మాదక ద్రవ్యాల ఉచ్చులో పడొద్దు

● డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్‌బాబు

● మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీ



రాజమహేంద్రవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్‌బాబు

రాజమహేంద్రవరం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాల ఉచ్చులో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నిషేధంపై ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో న్యాయ విజ్ఞానసదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడు స్నేహాల వల్ల లేదా పరిస్థితుల ప్రభావంతో తాత్కాలిక ఆనందం కోసం గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటుపడితే అనేక రుగ్మతలబారిన పడతారన్నారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

● మాదకద్రవ్యాల నివారణా దినోత్సవం సందర్భంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఆర్ట్స్ కళాశాల, ఎస్ఏవీటీ, రాజేంద్రనగర్ జడ్పీ హైస్కూల్‌లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, సెబ్ అడిషనల్ ఎస్పీ సోమశేఖర్, సెబ్ ఇంచార్జి ఏఈఎస్ టి.గోపాలకృష్ణ, నార్త్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో డా.ఎన్.నిక్సన్ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంకల్చరల్: స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశా లలో మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచార కమిటీ జనవిజ్ఞాన వేదిక బుధవారం విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన పోటీలో ఆదిత్య డి గ్రీ, పీజీ, నాలుగు కళాశాలల విద్యార్థులు కలిపి 100 మందికి పైగా పాల్గొన్నారు. యువతపై మాదక ద్రవ్యాల దుష్ప్రభావం పడకుండా జాగ్రత్త పడడం మన అందరి బాధ్యత అని ఆదిత్య కల్చరల్ కోఆర్డినేటర్ బిహెచ్ రమాదేవి అన్నారు. ఈ పోటీలను నిర్వహించిన జనవిజ్ఞాన వేదిక శ్రీరామమూర్తిని ఆమె అభినందించారు. ఈ పోటీల నిర్వహణకు సోను దుర్గాప్రసాద్, బిహెచ్ రమాదేవి, వెంకట్రావ్, ఎల్.వేంకటేశ్వరరావు, కృష్ణకుమారి, చంద్రశేఖర్, రామకృష్ణ, రాంబాబు సహకరించారు.

●శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.రాఘవకుమారి ఆధ్యక్షతన కళాశాల యూత్ రిడ్‌క్రాస్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కెఎస్ రత్నకుమార్ నిర్వహణలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సౌత్‌జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్ మాట్లాడారు. సీఐ పుల్లారావు,, ధన్వంతరి బ్లడ్ బాంక్ డాక్టర్ సూర్యప్రకాష్, డాక్టర్ కె.వి. రమణ, మహలక్ష్మి, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ వై.ప్రకాష్ కుమార్ పాల్గొన్నారు.

'మత్తు పదార్థాలు, మద్యపానానికి దూరంగా ఉండండి'

ధవళేశ్వరం: మత్తు పదార్థాలు, మద్యపాన వ్యసనానికి జీవితాన్ని నాశనం చేసుకోకుండా వాటికి దూరంగా ఉండాలని దక్షిణ మండలి డీఎస్పీ అంబికా ప్రసాద్ విద్యార్థులకు ఉద్బోధించారు. అంతర్జాతీయ మత్తు పదార్థాలు, మద్యపాన వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక వివేకానంద ఐటీఐలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ జి. వినయ్‌మోహన్, సిబ్బంది, ఐటీఐ ప్రిన్సిపాల్ సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

కడియం: యువత మత్తు పథార్థాలకు దూరంగా ఉండాలని కడియం ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ తెలిపారు. అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని బుధవారం కాలేజీ విద్యార్థులకు మత్తు పదార్థాల వలన కలిగే దుష్ప్రబావాలను వివరించారు. కడియం ఉన్నత పాఠశాల విద్యార్థులతో దేవీచౌక్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం టి.సత్యనారాయణ, ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ, పీడీ కె వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు నాశనం

దివాన్‌చెరువు: మాదక ద్రవ్యాలతో యువత భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని ఈస్ట్‌జోన్ డీఎస్పీ ఎం.కిషోర్ కుమార్ విద్యార్థులకు సూచించారు. దివాన్ చెరువులోని వీజేఎస్ కళాశాలలో బుధవారం డ్రగ్స్ దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా బుధవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమంలో కళాశాల కార్యదర్శి ఎస్‌వివి జగన్‌మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నరేంద్ర, సీఐ ఉమర్ అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో జననాల రేటు పెంచాలి

● ఆశ వర్కర్ల సమావేశంలో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



ఆశ వర్కర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 26 : ప్రభుత్వాసుపత్రుల్లో బర్త్ రేటు గణనీయంగా పెరగాలని, ఆరోగ్యకరమైన రాజమహేంద్రవరం మనందరి ధ్యేయం కావాలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఆశ వర్కర్లు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. బుధవారం రాజమహేంద్రవరం జీజీహెచ్‌లోని ఎంసీహెచ్ బ్లాకు సమావేశమందిరంలో ఆయన ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ, డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, గైనిక్ విభాగం వైద్యులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ఆశ వర్కర్లు విధి నిర్వహణలో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. సీరియస్‌గా ఉన్నప్పుడు తీసుకొస్తే ఇప్పుడెందుకు తీసుకొస్తున్నారు, మీరు ఫలానారోజు రావాలి కదా అని పంపించేస్తున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. గర్భిణీలకు లేబర్ రూంలో వైద్యసేవలు అందుతున్న సమయంలో విశ్రాంతి తీసుకోవడానికి ఒక గది కేటాయించాలని, గైనకాలజీ బ్లాకులోకి అనుమతించాలని కోరారు.

● దీనిపై ఎమ్మెల్యే శ్రీనివాస్ స్పందిస్తూ ఆశ వర్కర్ల ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామని అన్నారు. గర్భిణీలను క్షేమంగా ఆసుపత్రికి తీసుకొచ్చి తిరిగి వారిని వారి ఇళ్లకు పంపే బాధ్యత ఆశ వర్కర్లదేనని అన్నారు. తన తండ్రి ఆదిరెడ్డి అప్పారావు ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో అప్పటి ఆరోగ్య శాఖమంత్రితో మాట్లాడి గైనకాలజీకి ప్రత్యేకంగా ఒక విభాగాన్ని ఏర్పాటు చేయించారని గుర్తు చేశారు. ప్రతి 15 రోజులకు తాను ఆసుపత్రిలో సమావేశం నిర్వహిస్తానని, రోగులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ మాట్లాడుతూ ఆశ వర్కర్లకు త్వరలోనే ఒక గదిని కేటాయించడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ కచ్చితంగా యూనిఫామ్ ధరించి గుర్తింపుకార్డు కలిగి ఉండాలని స్పష్టం చేశారు. జీజీహెచ్ అధికారులు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అధికారులు అలసత్వం వహిస్తే సహించేది లేదు

● ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి



సింగంపల్లి రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

రంగంపేట, జూన్ 26: రంగంపేట మండలంలో అధికారులు ఎవరైనా అలసత్వం వహిస్తే సహించేదిలేదని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హెచ్చరించారు. బుధవారం రంగంపేట మండల తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చి, సుపరిపాలన అందించాలనే లక్ష్యంతో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. ఆర్ అండ్ బీ రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. రంగంపేట మండలం మెట్టప్రాంతమని ముఖ్యంగా చాగల్నాడు కాలువ, వ్యవసాయం, విద్యుత్, రహదారులు, తాగునీటికి సంబంధించిన సమస్యలపై చర్చించి వాటిని అధికారులు త్వరితగతిన పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి ఆళ్ళ గోవింద్, టీడీపీ మండల అధ్యక్షుడు వెలుగుబంటి సత్తిబాబు, బీజేపీ మండల అధ్యక్షుడు షైలవరపు సాయిరాం, జనసేన మండల అధ్యక్షుడు గిరిజాల సత్తిబాబు, తహశీల్దార్ తలీఫ్‌పాషా, ఎంపీడీవో శ్రీరామరాజు, విద్యాశాఖాధికార్లు కె.శ్రీనివాసరావు, పి.మధుసూదనరావు, ఉపాధి ఏపీవో వెంకటేశ్వర్లు, ఇంజనీరింగ్ జేఈ కె.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీవో జెస్సీఫ్లోరెన్స్, పీహెచ్‌సీ వైద్యులు, వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసరావు, వెటర్నరీ, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, ఆర్టీసీ తదితర మండల శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్లు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బుధవారం రంగంపేట-సింగంపల్లి,పెదరాయవరం-ముకుందవరం రోడ్లు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ ఆయాంలోనే రెండు రోడ్లు అభివృద్ధి పనులకు నిధులు విడుదలైనప్పటికీ బిల్లులు పెండింగ్ పెట్టడం వలన కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదన్నారు. రంగంపేట మండలంలో గల రంగంపేట - సింగంపల్లి, రంగంపేట-జి.దొంతమూరు రోడ్లు అధ్వానంగా పాడైపోయి, ఈ రోడ్లపై వాహదారులు ప్రయాణం చేయడానికి అనేక ఇబ్బందులు పడుతున్న సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లను అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే ఆర్ అండ్ బీ అధికారులతో సమీక్ష జరిపి ఈ రోడ్ల అభివృద్ధి పనులకు కొబ్బరికాయకొట్టి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి ఆళ్ళ గోవింద్, ఎన్డీయే నాయకులు, కార్యకర్తలు, ఆర్ అండ్ బి అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా గంగాలమ్మ జాతర

బిక్కవోలు, జూన్ 26: కొంకుదురు గ్రామ దేవతల్లో ఒకరిగా పూజలందుకుంటున్న గంగాలమ్మ జాతర బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవార్ని పడాల వంశీయుల ఆడపడుచుగా గ్రామస్తులు భావిస్తారు. ఈసందర్భంగా అమ్మవార్ని రాత్రి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారుర. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, దేశం నేతలు చింతా శ్రీనివాసరెడ్డి, తాతారెడ్డి, వీరభద్రారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాసరెడ్డి, కవలయ్య తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వంలో అన్నిరంగాలు నిర్వీర్యం

● ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

కడియం, జూన్ 26: గత ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో రాష్ట్రానికి ఒరింగింది ఏమీలేదని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. బుధవారం కడియం మండలం దుళ్ళ ఉన్నత పాఠశాలలో వాష్ ఇన్‌స్టిట్యూట్ వారు రూ.13.50లక్షలు, దాత చిట్టూరి వెంకన్న చౌదరి రూ. 1.5 లక్ష విరాళం మొత్తం రూ. 15లక్షలతో విద్యార్థులు భోజనం చేసేందుకు డైనింగ్ హాలు నిర్మాణం కోసం శంఠస్థాపన చేశారు. విద్యాభివృద్ధికి ముందుకొచ్చిన దాత చిట్టూరి వెంకన్నచౌదరిని ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మె ల్యే గోరంట్ల మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో విద్యావ్యవస్థతో పాటు అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయన్నారు. విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందచేసారు. అనంతరం దుళ్ళ ఎర్రకాలనీలో ఏర్పాటు చేసిన ఇంటింటికీ కుళాయి ద్వారా సురక్షిత మంచినీరు పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, మార్గాని సత్యనారాయణ, అన్నందేవుల చంటి, వెలుగుబంటి నాని, గుర్రపు సత్యనారాయణ, ముమ్మిడి దేవీనాగేశ్వరరావు, పాటంశెట్టి రాంజీ, తదితరులు పాల్గొన్నారు.

అనపర్తి టు అన్నవరం పాదయాత్ర

● మొక్కు చెల్లించుకునేందుకు పాదయాత్ర చేపట్టిన అభిమానులు



అన్నవరంవెళుతున్న పాదయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, జూన్ 26 : అనపర్తి నియోజకవర్గ ఎన్డీయే కూటమి అభ్యర్థిగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విజయం సాధిస్తే అన్నవరం పాదయాత్రగా వచ్చి సత్యనారాయణమూర్తిని దర్శించుకుంటామని మొక్కుకున్న ఎనిమిది మంది నల్లమిల్లి అభిమానులు బుధవారం అనపర్తి కెనాల్‌రోడ్డులోని వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. వీరి యాత్రకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. ఈ యాత్రలో అనపర్తికి చెందిన మామిడిశెట్టి శ్రీను, నామాల మార్కెండేయులు(చిన్ని), బదిరెడ్ల లోవరాజు, దర్భాసుల సతీష్, దూబా వేణు, మాడెం శివ, దొడ్డి శ్రీనివాస్, పొలమూరుకు చెందిన దొంతంశెట్టి వనుములు ఉన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, సిరసపల్లి నాగేశ్వరరావు, కర్రి వెంకటరామారెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, కర్రి శేషారత్నం, సిరసపల్లి లక్ష్మి, చింతా ప్రకాశరెడ్డి, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

సీతానగరం, జూన్ 26 : రాపాక పంచాయతీ పరిధిలోని శ్రీరామనగరం వద్ద గత కొంతకాలంగా తిరుగుతున్న గుర్తు తెలియని 27 ఏళ్ల వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందినట్లు వీఆర్వో గెడ్డం వెంకట్రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీతానగరం ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. శ్రీరామనగరం వద్ద గత 2,3 రోజులుగా తిరుగుతున్న వ్యక్తి అనారోగ్యంతో ఈనెల 20న అపస్మారక స్థితిలోఉండగా స్థానికులు అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిదంచారు. చికిత్స పొందుతూ ఈనెల 23న ఉదయం మృతి చెందాడు ఇతని పేరు కారాసు అరుణ్ ప్రసాద్ 27గా గుర్తిండం జరిగిందని ఇతనిది ఏ గ్రామం, బంధువులు ఎవరు అనేది తెలియరాలేదన్నారు. మృతదేహం మార్చురీలో ఉందని అనుమానం ఉన్నవారు మృతదేహాన్ని చూసి 94440904832కు తెలియపర్చాలని ఆయన తెలిపారు

ఉద్యోగుల సంక్షేమానికి చేయూత ఇవ్వండి

● జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ వినతి



సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభకు లిఖితపూర్వక సమాచారం ఇస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 26 : రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న వైద్య ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా నూతనంగా ఏర్పాటైన వెల్ఫేర్ అసోసియేషన్‌కు చేయూత ఇవ్వాలని జీజీహెచ్ కాంట్రాక్టు అండ్ అవుట్‌సోర్సింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభను కోరారు. ఈమేరకు బుధవారం అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కందుకూరి శ్యామ్‌కుమార్, ఎస్.సుధాకర్ తదితరులు సూపరింటెండెంట్ లక్ష్మీ సూర్యప్రభను ఆమె ఛాంబర్‌లో కలసి లిఖితపూర్వకమైన సమాచారం అందించారు. ఉద్యోగుల సంక్షేమానికి సహకరించాలని కోరారు. దీనిపై సూపరింటెండెంట్ సానుకూలంగా స్పందిస్తూ సంఘం ప్రభుత్వ గుర్తింపు పొందడం హర్షణీయమని, ఉద్యోగుల సంక్షేమానికి నిరంతరం కృషి చేయాలని పేర్కొన్నారు. అనంతరం సంఘ ప్రతినిధులు ఆర్ఎంవో డాక్టర్ ప్రణవ్, జీజీహెచ్ మేనేజర్ కేదార్, పరిపాలనాధికారి శ్యామ్ సుందర్‌లను కలిశారు. అధికారులను కలసిన వారిలో సంఘం సభ్యులు దారా చంద్రశేఖర్, కుశరాజు, అవినాష్, రమణ ఉన్నారు.

ప్రియదర్శిని ఆశ్రమంలో బధిర విద్యార్థులకు ప్రవేశాలు

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 26 : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చెవిటి, మూగ విద్యార్థులకు రాజమహేంద్రవరంలోని ప్రియదర్శిని ఆశ్రమంలో ఉచిత ప్రవేశాలు ప్రారంభమయ్యాయని ఆశ్రమం కరస్పాండెంట్ కె.స్వప్నవర్మ ఒక ప్రకటనలో తెలిపారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు, అలాగే ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రవేశాలు పొందిన బధిరులకు ఉచిత వసతి, భోజన సౌకర్యంతో పాటు ఉచితంగా నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలు, అన్ని పూర్తి విద్యా, వసతి సౌకర్యాలు అందించనున్నామని వివరించారు. వీటితోపాటు ప్రత్యేక ఉపాధ్యాయులచే బధిరులకు స్పీచ్ థెరపీ, ఉపాధి కోసం ఉచిత కంప్యూటర్ విద్య, టైలరింగ్, కుట్లు, అల్లికలు ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. మరిన్ని వివరాలకు 0883-2438288, 7036572300 నెంబర్లలోను, నేరుగాను ఆఫీస్ పనివేళల్లో సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు.

ఆర్టీసీ ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభ

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 26 : రాజమహేంద్రవరం డిపోలో ప్రతి నెలా ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేసి వారికి ప్రోత్సాహక, నగదు బహుమతులను అందించే కార్యక్రమంలో భాగంగా బుధవారం డిపో గ్యారేజీ మెయిన్ గేటు వద్ద ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. ఈ ఏడాది మే నెలలో అత్యధిక ఆదాయం, అత్యధిక డీజిల్ సేవింగ్స్ చేసిన నలుగురు కండక్టర్లు, ఐదుగురు డ్రైవర్లకు డిపో మేనేజర్ షేక్ షబ్నం నగదు బహుమతి, ప్రశంసాపత్రాలను అందజేశారు. అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) అజయ్‌బాబు, అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్) ఈశ్వరరావు, అవార్డు గ్రహీతలు, ట్రాఫిక్, మెకానికల్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై రైతులకు ఉపాధి కూలీలకు అవగాహన

కోరుకొండ, జూన్26: తూర్పుగోదావరి న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం కోరుకొండ మండల పరిషత్ సమావేశ మందిరంలో పలువురు ఉపాధి కూలీలకు న్యాయ సేవా సమితి, చట్టాలు గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి ప్రకాష్‌బాబు మాట్లాడుతూ కౌలుదారి చట్టం గురించి రైతులకు వివరించారు. ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు కొనే సమయంలో రైతులకు ఎవరైనా అన్యాయం జరిగినట్లు అయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖాధికారి కె. మాధవరావు,ఏడీఏ మల్లికార్జునరావు, ఉపాధి హామీ సిబ్బంది, ఉపాధి హామీ కూలీలు, రైతులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన బీవీఆర్ చౌదరి

కోరుకొండ, జూన్ 26: ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్, ఆర్‌టీజీ శాఖా మంత్రి, టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్‌ను రాజానగరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి, పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జ్ అడపా వీరబాబులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు రాజానగరం నియోజకవర్గం టీడీపీ పరిస్థితులను లోకేష్‌కు వివరించారు. మాజీ మంత్రియనమల రామకృష్ణుడును కలిసిన బొడ్డు ఈరోజు నారా లోకేష్‌ను కలిశారు.

ఏ మొఖంపెట్టుకుని ప్రతిపక్ష హోదా అడుగుతున్నావ్

● రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



రాజమహేంద్రవరం సిటీ, జూన్ 26 : అనాడు అసెంబ్లీలో నేను తలచుకుంటే నీకు ఉన్న 23 మంది ఎమ్మెల్యేలలో ఐదుగురిని ఇటు వీసుకుంటే నీకు ప్రతిపక్ష హోదాయే ఉండదు బాబు అన్నావ్ జగన్ గుర్తుతెచ్చుకో అని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ రాష్ట్రంలో ఘోరంగా ఓడిపోయాక కామెడీ ఎక్కువగా చేస్తున్నాడని అన్నారు. ఇప్పుడు విడ్డూరంగా తన పార్టీకి ప్రతిపక్ష హోదా కోసం స్పీకర్ అయ్యన పాత్రుడుకు లేఖ రాశావు అనాడు 18 మంది ఎమ్మెల్యేలు నీకు మిగిల్చితే ప్రతిపక్ష హోదా నీకు రాదు అన్న జగన్‌కి ఇప్పుడు కేవలం 11 మందితో ఈరోజు ప్రతిపక్ష హోదా ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఈ విషయంలో స్పీకర్ అయ్యన పాత్రుడు మాట్లాడారని అంటున్నారే ఆ రోజు అసెంబ్లీలో భువనేశ్వరమ్మను మీ గాలి నాయకులు దారుణంగా మా ట్లాడారు. మా నాయకుడు చంద్రబాబును ఏకవచంతో మాట్లాడారు. మరి మాకు బాధ ఉండదా అని ప్రశ్నించారు. జగన్ ఆత్మపరిశీలన చేసుకుని ముందుకు వెళ్లాలే తప్పా సింపతీ కోసం ప్రయత్నం చేయవద్దు ఎందుకంటే మీరు ఎన్ని దారుణాలు చేశారో ప్రజలకు తెలుసన్నారు.


'3 గ్యాస్ సిలిండర్ల పథకానికి ఈకేవైసీ తప్పనిసరి'

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 26 : రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందించబోతున్న మూడు గ్యాస్ సిలిండర్ల పథకానికి ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఎల్‌పీజీ డీలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మామిడి అప్పాజీ అన్నారు. రాజమహేంద్రవరంలో బుధవారం జరిగిన ఎల్‌పీజీ డీలర్స్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. డీలర్స్ వెల్ఫేర్ నిమిత్తం హోటల్, రెస్టారెంట్లకు 19కేజీల కమర్షియల్ సిలిండర్లపై 2024 జూలై 1 నుంచి డిస్కౌంట్ నిలుపుదల చేసేందుకు సభ ఏక గ్రీవంగా తీర్మానించిందన్నారు.

'ఉద్యోగ భద్రతలేక ఇబ్బందులు పడుతున్నాం'

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 26 : ఖరీఫ్, రబీలో మాత్రమే రైతు భరోసా కేంద్రాల్లో పనులు చేయించుకుని మిగిలిన వేళలో వదిలేయడం వల్ల ఉద్యోగభద్రత లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని నూతన ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, హెల్పర్లు తమ ఆవేదనను రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వద్ద వెల్లబుచ్చారు. ఎమ్మెల్యేను వారు కలిసి తొలుత శుభాకాంక్షలు తెలిపారు. తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి వినతిపత్రం అందించారు. దీనిపై ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పందించి ఈ సమస్యను మంత్రి దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
గురువారం 27 జూన్ 2024 | 3



జూలై 1న ఇంటి వద్దకే.. ఎన్టీఆర్ భరోసా పించన్లు

- ప్రజాప్రతినిధుల సమక్షంలో సచివాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో పంపిణీ
- జిల్లాలో భారీగా పెరిగిన పెన్షన్ సొమ్ము
- జిల్లాలో 2,44,302 మంది పింఛన్‌దార్లు
- రూ.165.13 కోట్లు పంపిణీ.. గత నెలలో రూ.72 కోట్లే
- బ్యాంకుల వారీ టార్గెట్లు కేటాయింపు
- 29న బ్యాంకుల్లో జమ.. ఆయా సెక్రటరీలతో డ్రా
- డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి

రాజమహేంద్రవరం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లను జూలై 1న ఆయా లబ్ధిదార్ల ఇంటి వద్దకే వెళ్లి, ప్రజాప్రతినిధుల సమక్షంలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు పంపిణీ చేయనున్నారు. దీనికి అవసరమైన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. బ్యాంకుల వారీ కేటాయింపులు చేశారు. ఈనెల 29నే బ్యాంకులలో డబ్బు జమఅవుతుందని, ఆయా సెక్రటరీలు డబ్బు డ్రా చేసి 1వ తేదీన ఉదయం ఆరు గంటల నుంచే పంపిణీ చేయనున్నామని జిల్లా గ్రామీణాభివృద్ధి ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్‌వీవీఎస్ మూర్తి తెలిపారు. ఈమేరకు బుధవారం రాత్రి ఆయన ఒక ప్రకటన జారీచేశారు. జిల్లా పింఛన్ల సొమ్ము భారీగా పెరిగిందని, గతంలో నెలకు జిల్లాలో సుమారు రూ.72 కోట్లు పంపిణీ చేస్తే, జూలైలో ఏకంగా జిల్లా వ్యాప్తంగా 2,44,302 మందికి రూ.165.13 కోట్లు పంపిణీ చేయనున్నట్టు ఆయన చెప్పారు. రూ.3 వేల నుంచి 4 వేలకు పెంచిన పింఛన్లకు ఏప్రిల్ నుంచే అమలుచేస్తున్నామని, ఆ సొమ్ము కూడా కలిపి జూలై 1న వృద్ధాప్య, వితంతువు, చేనేత, గీతకార్మికులు, ఫిషర్‌మెన్, ఒంటరి మహిళ, సంప్రదాయ చెప్పుకుట్టేవారు, కళాకారులు, ట్రాన్స్‌జెండర్స్, ఆర్ట్ (పీఎల్‌హెచ్‌టీవీ), డప్పు కళాకారులు వంటి 11 కేటగిరీల వారికి రూ.7 వేలు ఇస్తారన్నారు. వీరికి రూ.3 వేల నుంచి 4 వేలకు పెరిగిందని, ఆగస్టు నుంచి నెలకు 4 వేల వంతున పెన్షన్ వస్తుందన్నారు. దివ్యాంగులు, మల్టీ డెఫార్మిటీ లెప్రసీ బాధితులకు రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచారని, ఇక ప్రతీ నెలకు 6 వేల సొమ్ము చొప్పున వస్తుందని చెప్పారు. పూర్తిగా దివ్యాంగులైన వారికి రూ.5 వేల నుంచి రూ.15 వేలకు పెంచారని చెప్పారు. పెరాల్సిస్‌తో మంచంమీద, కుర్చీలో నుంచి లేవలేనివారికి, వివిధ ప్రమాదాల్లో గాయాలపై కదలలేని స్థితిలో ఉన్నవారికి ఇవి వర్తిస్తాయని చెప్పారు. కిడ్నీ, డయాలిస్ బాధితులకు రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పింఛన్ పెరిగిందన్నాను. మొత్తం 18 రకాల పింఛన్లు అమలు చేస్తున్నామన్నారు. ఈ పెన్షన్ల పంపిణీకి సంబంధించి పూర్తి చర్యలు తీసుకుంటున్నామని పీడీ మూర్తి చెప్పారు.


మూర్తి, డీఆర్‌డీఏ పీడీ



శివ ధనస్సులా.. ఆకాశం మేఘావృతమై ఉన్న వేళ పెరవలి మండలం తీపర్రు గోదావరి తీరంలో ఆకాశంలో శివ ధనుస్సులా మబ్బులు కనిపించాయి. పుష్కరాల రేవులో ఉన్న శివుని విగ్రహం వెనుక ఇది కనిపించడంతో ఉదయాన్నే గోదావరి తీరానికి వెళ్లే రైతులు ఈ దృశ్యాన్ని వీక్షించారు. - పెరవలి

పోలీస్ 'ట్రయల్స్'



- కావాల్సిన చోట పోస్టింగ్‌కి.. ▸ ఎవరి ప్రయత్నంలో వారు..
- త్వరలో బదిలీల జాతర ▸ వైసీపీకి అంటకాగిన వారిలో దడ
- అధికార పార్టీ నేతలను ప్రసన్నం చేసుకొనే పనిలో బిజీ

సార్వత్రికల ఎన్నికల పండుగ ముగిసింది. కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. వచ్చీ రావడంతోనే బ్యూరోక్రాట్ల ప్రక్షాళన మొదలుపెట్టింది. ఉన్నత స్థాయిలో గత ప్రభుత్వ పెద్దలతో అంటకాగి ప్రజాస్వామ్యాన్ని అభాసుపాలు చేసిన వారి పనిపట్టే చర్యలు వేగవంతం చేసింది. ముందుగా రాష్ట్ర స్థాయి అధికారులను స్థానం చలనం చేసింది. తర్వాత జిల్లా స్థాయి అధికారుల వంతు వచ్చింది. వైసీపీకి కొమ్ము కాశారనే ఆరోపణలు ఉన్న కలెక్టర్ మాధవీలతను ఇప్పటికే బదిలీ చేసి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. సాధారణ పరిపాలనా శాఖ (జీఏడీ)లో రిపోర్టు చేయాలని సీఎస్ ఆదేశించారు. జిల్లా స్థాయిలో మరికొందరు అధికారుల స్థాన చలనంపై ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. ఇదిలా ఉండగా డివిజన్, సబ్-డివిజన్ అంతకంటే తక్కువ స్థాయి అధికారుల బదిలీల జాతర మొదలుకానుంది. ముఖ్యంగా పోలీస్ శాఖలో బదిలీల విషయం త్వరలో తేలనుంది. దీంతో పోలీసు అధికారులు 'ట్రయల్స్' మొదలు పెట్టారు. ముఖ్యంగా ఇన్‌స్పెక్టర్లు, డీఎస్పీలు పోస్టింగుల కోసం అధికార పార్టీ నేతలను ప్రసన్నం చేసుకొనే పనిలో ఉన్నారు. ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పోలీసుల్లో బదిలీలు జరిగాయి. వారు ఇప్పుడు తమ 'సొంత' గూటికి చేరుకోడానికి ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు. అలా వచ్చిన వారిలో మరికొందరు అదే స్థానంలో కొనసాగడానికి, ఇంకొందరు లాభసాటి స్టేషన్‌లో పోస్టింగులకు నేతల చుట్టూ దుడ్డుతో ప్రదక్షిణలు చేస్తున్నారు.

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని ఎస్ఐ నుంచి డీఎస్పీ వరకూ బదిలీలకు సంబంధించి జాబితా సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. ఎన్నికల కోటాలో అడిషనల్ ఎస్పీలు కూడా జిల్లాకు వచ్చారు. వీరందరూ ఎక్కడకు ఎవరు వెళ్తారో తెలియని పరిస్థితి నెలకొంది. అయితే ఎన్నికల సమయంలో ఎక్కువగా కర్నూలు, కృష్ణా తదితర జిల్లాల నుంచి తూర్పుగోదావరికి వచ్చారు. వారందరూ ఇప్పుడు వారి ప్రాంతాలకు వెళ్లాలని కోరుకుంటున్నారు. ఎన్నికల కోటాలో రావడంతో మూడు నాలుగు నెలల్లో తిరిగి వెనక్కి వెళ్లిపోతామన్న ఉద్దేశంతో కుటుంబాలను ఇక్కడికి తీసుకురాలేదు. పిల్లలను కూడా అక్కడి స్కూల్స్‌లోనే చేర్పించారు. ఇప్పుడు వారి మునుపటి ప్రదేశానికి తప్ప ఎక్కడికి బదిలీ చేసినా తిప్పలు తప్పవనే ఆందోళన నెలకొంది. ఎన్నికల సమయంలో వైసీపీ నేతలు తమకు కావాల్సిన వాళ్లను తీసుకొచ్చుకున్నారు. అందుకు అప్పటికే ఆ స్థానంలో ఉన్న అధికారులను వేరొకచోటికి పంపించేశారు. అలా వచ్చిన వాళ్లు ఎన్నికలో సమయంలో వైసీపీ నేతలకు తమకు తోచిన 'సహాయం' చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు ఆ అధికారులు కూడా అధికార కూటమి నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని సమాచారం. ఎన్నికల సమయంలో రాజమహేంద్రవరం రూరల్‌లో ఓ పోలీస్ స్టేషన్, కొవ్వూరు రూరల్ పీఎస్‌కి వచ్చిన అధికారి, రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలోని ఓ జోన్ అధికారి వైసీపీ నేతలకు 'బాగా' కావాల్సిన వారనే ప్రచారం ఉంది. మరో జోన్ అధికారిపై ఎన్నికల సమయంలోనే ఎన్నికల సంఘానికి టీడీపీ ఫిర్యాదు చేసింది. రాజమహేంద్రవరం రూరల్‌లో ఓ ఇన్‌స్పెక్టర్ అదే పరిధిలోని మరో స్టేషన్‌లో సీటుకు ప్రయత్నించి సఫలీకృతం వరకూ వచ్చినట్టు చెప్పుకుంటున్నారని పోలీసు వర్గాల్లో వినవస్తోంది. మరికొందరు రాబడి బాగా వచ్చే స్టేషన్ కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు. జిల్లాలోని ఇసుక ర్యాంపులు, గ్రావెల్, కంకర, మట్టి వనరులు పరిధిలోకి వచ్చే స్టేషన్లు, రాజమహేంద్రవరం సిటీ, రూరల్ పరిధిలోని స్టేషన్లలో పోస్టింగులకు ఎవరి దారిలో వారు ట్రయల్స్‌లో మునిగిపోయారు. అయితే డీఐజీగా ద్వారకా తిరుమలరావు ఇటీవలే బాధ్యతలు స్వీకరించారు. దీంతో కింది స్థాయి సిబ్బంది బదిలీలపై త్వరలోనే దృష్టి సారించే అవకాశం ఉందంటున్నారు. ఎన్నికల కోటాలో వచ్చిన వాళ్ల బదిలీ తప్పదనే సాంకేతాలు వస్తున్నాయి.

● మంచి అధికారులు వెళ్లిపోతే..

జిల్లాలో ఏ పార్టీకి కొమ్ముకాయకుండా ఉన్న కొందరు పోలీసుల అధికారులు సైతం ఆందోళనలో ఉన్నారు. వైసీపీ నేతలు ఎంత ఒత్తిడి చేసినా, ప్రలోభాలకు గురిచేసినా ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ నిబంధనల ప్రకారం వారు నడుచుకున్నారు. వైసీపీ నేతలు తమ వారిని సదరు సీటులో కూర్చోబెట్టుకోడానికి పక్కకు తప్పుకోమంటే తలవంచుకొని వెళ్లిన వాళ్లూ ఉన్నారు. ఎన్నికల సమయంలోనూ ఈ తంతు నడిచింది. ఏ పార్టీ వాళ్లనూ నొప్పించకుండా జిల్లాలో ఎన్నికలు సజావుగా జరగడానికి, శాంతిభద్రతలకు ముప్పు వాటిల్లకుండా ఉండడానికి దోహదపడ్డారు. అటు ప్రజలతో ఇటు తమ సిబ్బందితో ఇబ్బంది లేకుండా నడుచుకున్నారు. ఎలాంటి విపత్కర సందర్భం ఎదురైనా సంయమనం పాటించారు. 'తూర్పు' ప్రశాంతం అనే మాటను రుజువుచేశారు. అలాంటి వారిని విడుచుకోడానికి అధికార కూటమి నేతలు సిద్ధంగా లేరని తెలుస్తోంది. ప్రస్తుతం జిల్లాస్థాయిలో పోలీస్ పరంగా మంచి టీం ఉందనే ప్రశంసలు ఉన్నాయి. అలాంటి పరిస్థితుల్లో మంచి అధికారులు వెళ్లిపోతే ఎలాంటి వారు వస్తారో అనే మీమాంశ కూడా కూటమి నేతల్లో ఉంది. పైగా కొత్తగా అధికార పగ్గాలు చేపట్టారు. జిల్లా అలవాటు పడిన వాళ్లను కదుపుకొంటే ఇబ్బందులు తప్పవనే ఆలోచన ఉంది. అలాంటి అధికారులను కొత్త ప్రభుత్వం వచ్చిందనే కారణంతో బదిలీ చేస్తే అది వారిని ఇబ్బందిపెట్టే పరిస్థితి వస్తుంది. ఆయా అధికారులను పంపేస్తే వైసీపీకి కొమ్ముకాశారని, అక్రమాలకు తలొగ్గారనే అపవాదు వారిపై పడే అవకాశం ఉంది. అందువల్ల అందరినీ ఒకే గాటన కట్టడం సరికాదనే వాదన బలంగా వినవస్తోంది. అలాగే ఐదేళ్లపాటు లూప్‌లైనులో ఉన్నవారు మంచి పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్నారు. వారితో వైసీపీ నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఈ ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందని వారంతా ఆశిస్తున్నారు.

● కిందిస్థాయి ఎదురుచూపులు

ఎక్కడికి బదిలీ చేస్తారో.. ఏ ఊర్లో పిల్లల్ని బడిలో చేర్చాలో.. తీరా చూస్తే తరగతులు మొదలైపోయాయి.. బదిలీల విషయం ఇంకా ఏమీ తేల్చలేదు.. ఇదీ ప్రస్తుతం కొన్ని పోలీసు కుటుంబాలు అనుభవిస్తున్న మనోవేదన. ఇన్‌స్పెక్టర్ నుంచి పైస్థాయి వరకూ అర్థబలంతో మేనేజ్ చేసుకొనే పరిస్థితి ఉంటుంది. కానీ, హోంగార్డు నుంచి ఏఎస్ఐ స్థాయి వరకూ ఆర్థికంగా సతమతమవుతూనే ఉంటారు. పోస్టింగుల కోసం చెల్లించుకొనే పరిస్థితి ఉండదు. ఈ నేపథ్యంలో జిల్లాలోని కొందరు పోలీసులు బదిలీల కోసం ఎదురుచూస్తున్నారు. కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ వరకూ బదిలీ చేసే అధికారం ఎస్పీ చేతిలో ఉంటుంది. సుదీర్ఘంగా ఒకేచోట పనిచేస్తున్న ఆ సిబ్బందిని ఏడాది కిందట ఎస్పీగా సుధీర్‌కుమార్‌రెడ్డి ఉన్న సమయంలో స్థాన చలనం కలిగించారు. తర్వాత ఐదేళ్లు మించి ఒకేచోట విధులు నిర్వర్తిస్తున్న వాళ్ల బదిలీలపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. గత నెలలో బదిలీల కోసం కొందరు అర్జీలు పెట్టుకున్నారు. కానీ 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమైనా వాటిపై ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదని తెలుస్తోంది. ఇప్పటికే ఈ నెల 13 నుంచి పాఠశాలలు, కళాశాలల్లోని తరగతులు ప్రారంభమైపోయాయి. సిలబస్‌ని కూడా మొదలుపెట్టేశారు. కానీ బదిలీల విషయంపై ఇంకా స్పష్టత లేదు. దీంతో స్కూల్‌లో ఇంకా చేర్చని పిల్లలకు సమాధానం చెప్పలేక తల్లిదండ్రులు సతమతమవుతున్నారు. ఒకవేళ బదిలీ ఆలస్యమైతే ఇప్పటికే తాము ప్రస్తుతం ఉన్న ప్రాంతంలోని స్కూల్‌లో చేర్పించిన పిల్లలను విద్యా సంవత్సరం మధ్యలో వేరే చోటికి తరలించడం ఇబ్బందిగా మారుతుందని ఆందోళన వ్యక్తమవుతోంది. పలు కార్పొరేట్ కళాశాలల్లో చదివే పిల్లలను మధ్యలో వేరే చోటికి తీసుకెళ్తే ఫీజులు వెనక్కు తిరిగి ఇవ్వడానికి తీవ్రంగా ఇబ్బంది పెట్టే పరిస్థితి ఉంది. ఒకవేళ వారి బ్రాంచి ఆ ఊర్లో ఉంటే కొద్దిగా ఊపిరి పీల్చుకున్నట్లే. లేకపోతే తిప్పలు తప్పవు. ఈ నేపథ్యంలో రిక్వెస్టులు పెట్టుకున్న పోలీసులు బదిలీల ఆదేశాల(డీవో) కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లాలో సుమారు 130 మంది వరకూ బదిలీకోసం వినతి సమర్పించగా.. దాదాపు 80 మంది అర్హత ఉన్న వారిగా తెలుస్తోంది. వీళ్లందరూ డీవోల కోసం వేచి చూస్తున్నారు. ముఖ్యంగా పిల్లలను స్కూల్‌లో చేర్చే విషయంలో తర్జనభర్జన పడుతున్నారు. భార్యాభర్తలు వేర్వేరు చోట్ల పని చేసే వాళ్లు, పెద్ద వాళ్లకు ఆరోగ్య సమస్యలు ఉన్నవారు పిల్లల చదువుల విషయంలో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో డీవోలు తాము కోరుకున్నట్టు వస్తే ఆ సమస్య కూడా తీరుతుందని ఆశ పడుతున్నారు. అర్జీలు పెట్టుకున్న వాళ్లే కాకుండా ఐదేళ్లకు మించి ఒకేచోట పాతుకుపోయిన వాళ్లపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం కనిపిస్తోంది. ఒకచోట డీవో ఉన్నా తాము కోరుకున్న చోట ఏళ్ల తరబడి పాతుకుపోయి వాళ్లూ ఉన్నారు. ఆయా సీట్లలోకి వచ్చే అధికారులను ప్రసన్నం చేసుకొని పబ్బం గడుపుకొంటున్నారు. సదరు అధికారులను 'పక్కదోవ' పట్టించడంలో కీలకంగా వ్యవహరిస్తూ అన్నీ తామై 'చక్కబెడుతున్నారనే' ఆరోపణలు ఉండగా, వారిపై ఓ కన్నేసి ఉంచాల్సి ఉంది.


మంత్రి దుర్గేష్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

గోదావరి టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు

రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్

కడియం, జూన్ 26: గోదావరి ప్రాంతం అందాలకు నిలయమని, అందుకే ఈ ప్రాంత అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు. కడియం మండలం బుర్రిలంక పాటంశెట్టి సుబ్బారావు-శివరామ నర్సరీకి మంత్రి దుర్గేష్ విచ్చేశారు. జనసేన నాయకులు, జనసైనికులు దుర్గేష్‌కు ఘనస్వాగతం పలికారు. మంత్రి హోదాలో తొలిసారిగా బుర్రిలంక విచ్చేసిన దుర్గేష్ స్థానిక విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం పర్యాటకరంగాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. గోదావరి జిల్లాలో పర్యాటకులను ఆకట్టుకునేవిధంగా అనేక రమణీయ ప్రాంతాలు ఉన్నాయన్నారు. ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం, హెరిటేజ్ టూరిజం, హేవలాక్ బ్రిడ్జిలను అనుసంధానం చేస్తూ అద్భుతంగా సర్క్యూట్ టూరిజంగా అభివృద్ధి చేస్తామన్నారు. కడియపులంకలో మధ్యలో నిలిచిపోయిన ఎకో-టూరిజం భవనం పునః నిర్మిస్తామన్నారు. హేవలాక్ వంతెన సుందరీకరణ, పిచ్చికలంక పర్యాటక అభివృద్ధికి కృషిచేస్తామని మంత్రి దుర్గేష్ తెలిపారు. గత ప్రభుత్వంలో రుషికొండను విచ్ఛిన్నం చేసి కోట్లాది రూపాయల దుర్వినియోగం చేసి విలాసవంతమైన భవనాలను నిర్మించారన్నారు. గత ప్రభుత్వం పర్యాటక రంగ అభివృద్ధికి ఏ మాత్రం ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. చివరకు కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలకు జలజీవన్ మిషన్ ద్వారా తాగునీటి సరఫరాకు కోట్లాది రూపాయలు కేటాయిస్తే వాటిని కూడా మళ్లించి ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయేలా గత ప్రభుత్వం చేసిందన్నారు. గ్రామ పంచాయతీలకు కేటాయించిన కేంద్ర నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం వాడేసుకుందన్నారు. అందుకే జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ గ్రామ పంచాయతీ, గ్రామీణాభివృద్ధి వంటి శాఖలు తీసుకుని రూరల్ ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పాటంశెట్టి సూర్యచంద్రరావు, వెలుగుబంటి ప్రసాద్, గట్టి నర్సయ్య, మార్గాని సత్యనారాయణ, అన్నందేవుల చంటి, వెలుగుబంటి నాని, ముద్రగడ జమీ, పాటంశెట్టి రాంజీ, రత్నం అయ్యప్ప, చెక్కపల్లి మురళి, బోడపాటి గోపి, మల్లు పోలరాజు, గెడ్డం శివ, ఆదిమూలం సాయి, మార్గాని ఏడుకొండలు, బొర్సు సుబ్రహ్మణ్యం, విత్తనాల సాయి, జంగా వినోద్, నాగిరెడ్డి రామకృష్ణ, గాజుల రత్తయ్య, కర్రి చినబాబు, పాటంశెట్టి వాసు, జనసైనికులు, నర్సరీ రైతులు ఉన్నారు. అనంతరం కడియపులంక అభయాంజనేయస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పల్ల సుబ్రహ్మణ్యం, మల్లు శివ పాల్గొన్నారు.

ఇంటర్ మొదటి ఏడాది సప్లిమెంటరీలో జిల్లాకు 17వ స్థానం

రాజమహేంద్రవరం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఇంటర్ మొదటి ఏడాది సప్లిమెంటరీ (నాన్ ఇంప్రూవ్డ్) పరీక్షల్లో తూర్పుగోదావరి జిల్లా 41 శాతంతో 17వ స్థానంలో నిలిచింది. మొత్తం 4125 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 1689 మంది, ఒకేషనల్‌లో 510కి 226 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. షార్ట్ మార్క్స్ మెమోలు వచ్చేనెల ఒకటి నుంచి https://resultsbie.ap.gov.in వెబ్‌సైటులో అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. అలాగే రీ-వెరిఫికేషన్ కోసం సబ్జెక్టుకు రూ.వెయ్యి చెల్లించి ఈనెల 28 నుంచి వచ్చే నెల 4 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు గత నెల 24 నుంచి ఈ నెల 1 వరకూ జరిగిన విషయం తెలిసిందే.

పది సప్లిమెంటరీలో 10వ స్థానంలో తూర్పుగోదావరి

రాజమహేంద్రవరం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బుధవారం విడుదల చేసిన పదో తరగతి అడ్వాన్సుడు సప్లిమెంటరీ పరీక్షల్లో జిల్లా 10వ స్థానంలో నిలవగా.. బాలురు పైచేయి సాధించారు. జిల్లాలో బాలురు 3473 మంది పరీక్ష రాయగా 2649(76.27%)మంది, బాలికలు 2275 మందికిగాను 1810(79.56) మంది.. మొత్తం 5748 మంది విద్యార్థులకు 4459(77.57%) మంది ఉత్తీర్ణత సాధించారు. ఫలితాలు www.bse.ap.gov.in వెబ్‌సైటులో అందుబాటులో ఉంచామని అధికారులు పేర్కొన్నారు. ఈనెల 27 నుంచి వచ్చే నెల 1న రాత్రి 11 గంటల వరకూ రీ-కౌంటింగ్, రీ-వెరిఫికేషన్‌కి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సీఎఫ్‌ఎంఎస్ సిటిజన్ చలాన్ ద్వారా ఫీజు చెల్లించవచ్చని, రీకౌంటింగ్‌కి ఒక్కో సబ్జెక్టుకు రూ.500, రీ-వెరిఫికేషన్‌కి రూ.వెయ్యి చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు.


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

అందుబాటులో లేకపోతే కాల్ చేయండి : ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): 'ఆకతాయిలు, బ్లేడ్, గంజాయి బ్యాచ్‌ల వల్ల ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా నాయకులు అందుబాటులో ఉంటారు. వారు సరైన రీతిలో స్పందించకపోతే నా సెల్ నెం.9866317039కి ఫోన్ చెయ్యండి. ఎప్పుడూ అందుబాటులో ఉంటాను. పోలీసుల ద్వారా తగిన చర్యలు తీసుకుంటా' అని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. క్షేమ సమాచారాల కోసం ఫోన్ చేసి సమయం వృథా చేయకుండా ఇబ్బందులు ఎదురైతే తప్పకుండా ఫోన్ చేయాలని స్పష్టంచేశారు. సోమాలమ్మ ఆలయం సమీపంలో నిర్వహించిన 'మీభద్రత మా బాధ్యత' కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసం 'మీ భద్రత మా బాధ్యత'ను ప్రారంభించామన్నారు. బ్లేడ్‌బ్యాచ్, గంజాయి, ఆకతాయిల ఆగడాలను అరికట్టడం వంటి అంశాలు ఈ కార్యక్రమానికి ముడిపడి ఉన్నాయన్నారు. సీఐ వి.వుల్లారావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశీనవీన్, నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు, శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనరు కుడుపూడి సత్తిబాబు, మాలే విజయలక్ష్మి పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో డయేరియా కేసులు నమోదు

ఏడు కేసులు, మూడు డిశ్చార్జి, 4 కేసులకు ట్రీట్‌మెంట్

ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి : హెచ్‌వోడీ

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 26 : రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో మొత్తం ఏడు డయేరియా కేసులు నమోదయ్యాయి. వీటిలో మూడు కేసులకు ఆసుపత్రి వైద్యులు మెరుగైన వైద్యసేవలందించడంతో కోలుకోగా డిశ్చార్జి చేశారు. ప్రస్తుతం నాలుగు కేసులకు చికిత్స అందిస్తున్నారు. వీరంతా మహిళలే. డయేరియా విషయంలో అప్రమత్తంగా ఉండాలంటూ ప్రభుత్వం ఇప్పటికే ముందస్తు హెచ్చరికలు, ఆదేశాలు జారీచేయడంతో అప్రమత్తమైన జీజీహెచ్ అధికారులు డయేరియా కేసులకు చికిత్స అందించడానికి ప్రత్యేకంగా ఒక వార్డును ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం సిటీ పరిధిలో మూడు కేసులు నమోదు కాగా వీరిలో సీటీఆర్ఐ ప్రాంతానికి చెందిన 40 ఏళ్ల మహిళ ఒకరున్నారు. ఈమె ఈనెల 23న జీజీహెచ్‌లో చేరారు. మరో ఇద్దరు మహిళలు 24, 26 తేదీల్లో చేరారు. గండేపల్లి పీహెచ్‌సీ నుంచి 45 ఏళ్ల ఒక మహిళను అనుమానిత లక్షణాలతో జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. రాజవోలుకు చెందిన 53 ఏళ్ల వ్యక్తి కోలుకోవడంతో అతన్ని డిశ్చార్జి చేశారు. మరొకరు కొంతమూరు ప్రాంతానికి చెందిన వ్యక్తి అని సమాచారం. ఈ నేపథ్యంలో డయేరియా కేసుల కోసం జీజీహెచ్ మెడికల్ యూనిట్ సమీపంలో ప్రత్యేకంగా మేల్/ఫిమేల్ వార్డును ఏర్పాటుచేశారు. జీజీహెచ్ జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ పర్యవేక్షణలో బాధితులకు వైద్యులు, వైద్య సిబ్బంది చికిత్స అందిస్తున్నారు. అయితే డయేరియా ప్రత్యేక వార్డులో వైద్య సిబ్బంది కొరత ఉందని చెబుతున్నారు. స్టాఫ్‌నర్సు, ఇతర నర్సింగ్ స్టాఫ్ అవసరమైనమేరకు లేకపోవడంతో వైద్యసేవలకు విఘాతం కలుగుతున్నదనే విమర్శలున్నాయి.

వాతావరణంలో అనూహ్య మార్పులతోనే డయేరియా

వాతావరణ పరిస్థితుల్లో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నందున ప్రజలు తగిన ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని జీజీహెచ్ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగడంతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ముఖ్యమని తెలిపారు. వేడివేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యమని సూచించారు. డయేరియా చికిత్సకు అవసరమైన మందులన్నీ అందుబాటులో ఉన్నాయని, ఏవైనా అనుమానిత లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలని కోరారు.


ర్యాలీలో పాల్గొన్న జిల్లా ఎస్పీ జగదీశ్, ఇతర పోలీసు అధికారులు

దేశ భవిష్యత్తును కుంగదీసే.. మాదక ద్రవ్యాలను అరికడదాం

మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీలో జిల్లా ఎస్పీ జగదీశ్

రాజమహేంద్రవరం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): యువత జీవితాలను సర్వనాశనం చేస్తూ దేశ భవిష్యత్తును కుంగదీస్తున్న మాదకద్రవ్యాల (డ్రగ్స్)ను అరికట్టడాన్ని సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని ఎస్పీ జగదీశ్ పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వాటివల్ల కలిగే దుష్ప్రభావాలను నినదిస్తూ పోలీసులు, కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల సామాజికంగా చులకనవుతారన్నారు. ఇంట్లో పెద్దవాళ్లు కూడా తలదించుకోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. మానసిక, శారీరక అనారోగ్యాల బారినపడి జీవితం నాశనమవుతుందని చెప్పారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాలు అమ్మకం, వినియోగం, నిల్వలపై పోలీసులకు సమాచారం ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. దగ్గరలోని పోలీసులకు లేదా తనకు నేరుగా సమాచారం ఇవ్వవచ్చని చెప్పారు. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయం అందించాలని కోరారు. జిల్లాలో యువత మాదకద్రవ్యాల బారినపడకుండా అన్ని పాఠశాలలు, కళాశాలల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు వాటి వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరిస్తూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశామన్నారు. అవగాహనా ర్యాలీలో అడిషనల్ ఎస్పీ(ఎస్ఈబీ) పి.సోమశేఖర్, డీఎస్పీలు విజయ్‌పాల్, అంబికా ప్రసాద్, త్రీటౌన్ సీఐ ప్రసన్న వీరయ్యగౌడ్ పాల్గొన్నారు.


రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాల రైతుబజార్‌లో సబ్సిడీ టమాటా విక్రయాలను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ తేజ్‌భరత్

టమాటా ధరల దూకుడుకు చెక్

రైతుబజార్లలో సబ్సిడీపై కిలో రూ.50, కుటుంబానికి రెండు కిలోలు.. విక్రయం ప్రారంభించిన జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 26: రోజురోజుకూ పెరిగిపోతున్న టమాటా ధరలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా జిల్లాలోని ఆరు రైతుబజార్ల ద్వారా సబ్సిడీ ధరలకే గ్రేడ్1 టమాటాలను విక్రయించాలని అధికార యంత్రాంగం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు బుధవారం జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల రైతుబజార్‌లో టమాటా అమ్మకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తేజ్‌భరత్ మాట్లాడుతూ జిల్లాలో ధరల నియంత్రణ కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతున్నదన్నారు. ప్రభుత్వ ఆదేశాలమేరకు రైతుబజార్ల ద్వారా కిలో రూ.50లకే ప్రతి కుటుంబానికి రెండు కిలోల టమాటాలను విక్రయాన్ని అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. రాజమహేంద్రవరంలో ఐదు, కొవ్వూరులో ఒక రైతుబజారులో సబ్సిడీపై టమాటాలను విక్రయించనున్నామని తెలిపారు. పుంగనూరు నుంచి ఐదు మెట్రిక్ టన్నుల టమాటాలను జిల్లాకు దిగుమతి చేసుకున్నామన్నారు. ప్రతి రెండు రోజులకు ఒకసారి పరిస్థితిని సమీక్షించి టమాటాలను సరఫరా చేసే ప్రాంతాలను గుర్తించి ఆ మేరకు సరుకును తీసుకురావడం జరుగుతుందన్నారు. మార్కెటింగ్ ఏడీఎం సునీల్‌కుమార్, రైతు బజార్ల ఎస్టేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

సుందర గోవిందుడి ఆలయంలో
బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కొవ్వూరు, జూన్ 26 : కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని సుందర గోవిందుని గోశాలలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వెంకటేశ్వరస్వామికి ప్రత్యేకపూజలు చేపట్టారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఉదయం 8నుంచి 12 వరకు గోపూజ, మంత్ర జపాలు, చండీ పారాయణం నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. మధ్యాహ్నం 3 నుంచి 8 గంటల వరకు అష్టద్రవ్య సహిత లక్ష్మీగణపతి హోమం జరిపించారు. ఆలయకమిటీ సభ్యులు మాట్లాడుతూ సుందర గోవిందుని బ్రహ్మోత్సవాలు 12 సంవత్సరాల తరువాత ప్రారంభించారన్నారు. 27న మధ్యాహ్నం 3 నుంచి 8 గంటల వరకు సుబ్రహ్మణ్య షడావరణ అర్చన, 28న మధ్యాహ్నం 3 నుంచి 8 గంటల వరకు సుబ్రహ్మణ్య హోమం, చండీహోమం, 29న ఉదయం శ్రీవారి కళ్యాణం, తులసీపత్రి పూజ, మధ్యాహ్నం 3 నుంచి 8 గంటల వరకు మంత్రపూరిత పవిత్ర నదుల తీర్థాలతో 1,116 కుంభస్థాపన, అర్చన, 30న ఉదయం 8 నుంచి 12 వరకు పూర్ణాహుతి, భక్తులచే స్వామివారికి కుంభాభిషేకం, శిఖరపూజ, స్వస్తి, భక్తులకు అన్నదానం చేస్తామన్నారు. 12 సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ అపూర్వ అవకాశంలో కొవ్వూరు పట్టణ, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉండ్రాజవరంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు


పూజా కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి

ఉండ్రాజవరం, జూన్ 24: ఉండ్రాజవరంలో వెంకటేశ్వరస్వామివారి ఆలయంలో ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. స్వామివారికి ఉదయం పూజలు, అభిషేకాలు, హారతులు నిర్వహించారు. సాయంత్రం పుష్పోత్సవం, ఏకాంత సేవా దర్శనం జరిపారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. చుట్టుపక్క గ్రామాలను అధిక సంఖ్యలో వచ్చారు.

కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో
2019 ముందు రైళ్ల హాల్ట్‌ను పునరుద్ధరించాలి

• రైల్వే డీఆర్ఎంకు వినతిపత్రం అందించిన కొవ్వూరు రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు


విజయవాడ రైల్వే డీఆర్ఎంకు వినతిపత్రం అందజేస్తున్న కొవ్వూరు రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు

కొవ్వూరు, జూన్ 26: కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో 2019 ముందు ఆగే 36 రైళ్ళ హాల్ట్‌లను తిరిగి యథాతథంగా పునరుద్ధరించాలని రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం కొవ్వూరు రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు విజయవాడలో రైల్వే డిఆర్ఎమ్ నరేంద్ర అనందరావు పాటిల్‌ను కలిసి కొవ్వూరు స్టేషన్‌లో కొవిడ్ కారణంగా నిలుపుదల చేసిన 36 రైళ్ళ హాల్ట్‌లను తిరిగి పునరుద్ధరించాలని వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా కొవ్వూరు స్టేషన్‌లో రద్దుచేసిన రైళ్ళ హాల్ట్‌లను తిరిగి పునరుద్ధరించాలని కొవ్వూరు ఆంధ్రసుగర్స్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల నరేంద్రనాద్ చౌదరి తమ సంస్థ ద్వారా రైల్వేశాఖకు అందించిన వినతిపత్రాన్ని రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు డిఆర్ఎమ్‌కు అందజేశారు. రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు మాట్లాడుతూ కొవిడ్ కారణంగా కొవ్వూరు రైల్వేస్టేషన్‌ల్లో రైళ్ల హాల్ట్‌ను రద్దుచేశారు. కొవిడ్ అనంతరం దేశ వ్యాప్తంగా అన్ని రైల్వేస్టేషన్లలో రైళ్ళ హాల్ట్‌ను పునరుద్ధరించారు. అయితే కొవ్వూరులో ఈనాటికీ రైళ్లు ఆగడం లేదు. 10 కిలోమీటర్ల దూరంలో మూడు హాల్ట్‌లు ఉన్నాయని సాకుగా చూపిస్తున్నారు. కొవ్వూరు రైల్వేస్టేషన్ పరిధిలో కొవ్వూరు, తాళ్లపూడి, చాగల్లు, దేవరపల్లి, గోపాలపురం, మండలాల్లో సుమారు 100 గ్రామాలతో పాటు పోలవరం ఏజన్సీ ప్రాంతవాసులకు అనువుగా ఉంటుంది. ప్రధానంగా ఇతర రాష్ట్రాలలో ఉన్నత విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులు సెలవుల సమయంలో ఇంటికి చేరుకోవడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో రాజమహేంద్రవరం స్టేషన్‌లో దిగి మహిళలు, బాలికలు ఇళ్లకు చేరుకోవాలంటే భయాందోళన చెందుతున్నారు. రాజమహేంద్రవరం మెయిన్ స్టేషన్ తరువాత ప్రజల సౌకర్యాలను దృష్టిలో పెట్టుకుని గోదావరి స్టేషన్ కంటే కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో అన్ని రైళ్లను నిలుపుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో హజీబు జగన్నాధరావు, వెంపా విల్సన్‌రాజ్, పడాల సుబ్బారెడ్డి, టిడిఎల్ ప్రసాద్, కె.వి. రమణ, వై.కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.

'నియోజకవర్గం అభివృద్ధికి సమష్టి కృషి అవసరం'


చాగల్లు ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి

చాగల్లు, జూన్ 26 : నియోజకవర్గం అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సమిష్టిగా పనిచేద్దామని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ప్రభుత్వ ఆలోచనా విధానాలకు అనుగుణంగా ఉద్యోగులు పనిచేయాలని, మీ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులూ పరిచయ కార్యక్రమం, శాఖలవారీ సమీక్షా కార్యక్రమం నిర్వహించారు. తొలిసారిగా మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యే ముప్పిడిని పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గ్రామాల్లోని తాగునీరు, వీధిలైట్లు, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. చాగల్లు హైస్కూల్‌లో మంచినీటి బోరు ఏర్పాటు, గ్రామంలో డ్రైనేజీ సమస్య, మార్కొండపాడు ప్రభుత్వ ఆసుపత్రిలో వసతుల కల్పన, మార్కొండపాడు సచివాలయం భవనం ప్రారంభంపై సత్వరచర్యలకు ఆదేశించారు. టీడీపీ నాయకుడు తాళ్యూరి హరిశ్చంద్రప్రసాద్ రైతులకు దమ్ములు చేసుకోవడానికి వీలుగా వ్యవసాయ విద్యుత్ ఉదయం 5 గంటల నుంచి ఇవ్వాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.బుజ్జి, తహసీల్దార్ ఎం.సావిత్రి, ఎంపీపీ వీరాస్వామి, టీడీపీ నాయకులు ఆళ్ళ హరిబాబు, నాదెళ్ళ శ్రీరామ్‌చౌదరి, కరుటూరి సతీష్, జనసేన నాయకులు చిరంజీవి, ఇంటి వీరబాబు, బీజేపీ నాయకులు తాళ్యూరి వరప్రసాద్, జుట్ట గణపతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అలాగే చాగల్లు జిల్లాపరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, బ్యాగులతో కూడిన ప్రత్యేక కిట్‌లను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు విద్యార్థులకు అందజేశారు.

మహిళ ఆత్మహత్య విషయంలో
వదంతులు వ్యాప్తి చేస్తే చర్యలు

• కొవ్వూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి



రాజమహేంద్రవరం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): నల్లజర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో అనంతపల్లిలో ఒక మహిళ చెదల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న కేసులో అనుమానాలు వ్యక్తపరుస్తూ వదంతులు వ్యాప్తిచేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కొవ్వూరు డీఎస్పీ కె.శ్రీనివాసమూర్తి హెచ్చరించారు. ఈ నెల 23న ఉదయం 7.30గంటల సమయంలో గ్రామానికి చెందిన మండల రాము అనే వ్యక్తి తన భార్య మండల పెద్దింట్లు తనకున్న అనారోగ్య సమస్యలవల్ల 22న ఉదయం 5గంటల ప్రాంతంలో ఇంట్లో ఉన్న చెదల మందు తాగి అపస్మారక స్థితిలో బాత్‌రూం వద్ద పడి ఉండగా బంధువులు, చుట్టుపక్కల వారు వైద్యం కోసం ఆమెను పుల్లలపాడు ఆస్పత్రికి తరలించారని చేసిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామన్నారు. మెరుగైన చికిత్స కోసం ఏలూరు ఆంధ్రా హాస్పటల్‌కి తర్వాత గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మరణించిందని ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. తానే చెదలమందు తాగినట్లు పెద్దింట్లు తెలిపిందన్నారు. ఆమె భర్తగానీ, డాక్టర్ ఇచ్చిన సమాచారం లోగానీ ఎలాంటి అనుమానం వ్యక్తం చేయలేదని డీఎస్పీ వివరించారు. బంధువులు, సాక్షుల సమక్షంలో శవపంచనామా నిర్వహించిన సమయంలో కూడా ఎలాంటి అనుమానాలూ వ్యక్తం కాలేదన్నారు. కొన్ని దిన పత్రికల్లో ఆరోపణలు వ్యక్తం చేస్తూ వార్తలు ప్రచురించారన్నారు. అలాంటి అనుమానాలను రక్తసంబంధీకులు లేదా బంధువులు, సాక్షులు వెల్లడించలేదని చెప్పారు. అనంతపల్లికి చెందిన టీడీపీ వర్గీయులు, ఇతర వ్యక్తులు, రాముపై గానీ ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు. ఒకవేళ ఎవరైనా ఫిర్యాదు చేస్తే దర్యాప్తు చేస్తామన్నారు. పత్రికల్లో వచ్చిన అంశాలు అవాస్తవాలని డీఎస్పీ తెలిపారు. అలాంటి వదంతులు వ్యాప్తి చేస్తే చర్యలు తప్పవన్నారు.

'వాటర్ ట్యాంకుల్లో విధిగా క్లోరినేషన్ చేయాలి'

ఉండ్రాజవరం, జూన్ 26 : వాటర్ ట్యాంకుల్లో విధిగా క్లోరినేషన్ చేయించాలని ఎంపీడీవో కె. నరేంద్రరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పాలంగి, కె.సావరం గ్రామాల్లో రక్షితమంచినీటి పథకాల ట్యాంకులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లోరినేషన్‌తోపాటు ట్యాంకులను శుభ్రం చేయాలని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి, విద్యార్థులకు పెడుతున్న భోజనాన్ని పరిశీలించారు. పిల్లలకు నాణ్యమైన భోజనం పెట్టాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆయన సూచించారు. సర్పంచ్‌లు బొక్కా శ్రీనివాస్, నార్ని రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి ఎమ్‌డీ హసన్ జాని పాల్గొన్నారు.


రాజమహేంద్రవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్‌బాబు


కొవ్వూరు విజయవిహార్ సెంటర్‌లో మానవహారం దృశ్యం


నిడదవోలులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు


దేవరపల్లిలో మానవహారం నిర్వహించిన సెబ్, పోలీసులు, విద్యార్థులు

మాదక ద్రవ్యాల ఉచ్చులో పడొద్దు

• డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్‌బాబు
• మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీ



గోపాలపురంలో ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

రాజమహేంద్రవరం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాల ఉచ్చులో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల నిషేధంపై ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో న్యాయ విజ్ఞానసదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడు స్నేహాల వల్ల లేదా పరిస్థితుల ప్రభావంతో తాత్కాలిక ఆనందం కోసం గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటుపడితే అనేక రుగ్మతలబారిన పడతారన్నారు. ఎన్‌డీపీఎస్ యాక్ట్-1985పై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలు కలిగి ఉండడం, సేవించడం, సరఫరా చేయడం, తయారీ, క్రయవిక్రయాలు అన్నీ క్రిమినల్ నేరాలని.. కఠినశిక్షలు తప్పవని హెచ్చరించారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడిన వాళ్లు వాటి నుంచి విముక్తి కోసం స్వయంగా ముందుకు వస్తే వారిపై ఎలాంటి నేర విచారణా ఉండదన్నారు. ఉచితంగా వైద్య సహాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామచంద్రరావు పాల్గొన్నారు.

● మాదకద్రవ్యాల నివారణాదినోత్సవం సందర్భంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఆర్ట్స్ కళాశాల, ఎస్‌వీటీ, రాజేంద్రనగర్ జడ్పీ హైస్కూల్‌లో అవగాహనా కార్యక్ర మాలు నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగంవల్ల కలిగే నష్టాలను వివ రించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, సెబ్ అడిషనల్ ఎస్పీ సోమశేఖర్, సెబ్ ఇంచార్జి ఏఈఎస్ టి.గోపాలకృష్ణ, నార్త్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో డా.ఎస్.నిక్సన్ తదితరులు పాల్గొన్నారు.

దేశ భవిష్యత్ యువతపైనే ఆధారం

కొవ్వూరు: దేశ భవిష్యత్ యువతపై ఆధారపడి ఉందని కొవ్వూరు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు అన్నారు. మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసు, ఎస్ఈబీ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని వివిధ కళాశాలల విద్యార్థులతో డ్రగ్స్, మాదకద్రవ్యాల వినియోగం వలన కలుగు అనర్థాలను వివరిస్తూ పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి ర్యాలీ చేపట్టారు. విజయవిహార్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు, ఎస్ఈబీ సీఐ జి.శ్రీనివాసరావులు మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజస్థాపనకు ప్రతి పౌరుడు సహకరించాలన్నారు. డ్రగ్స్, మాదవ ద్రవ్యాల వినియోగం వలన కలుగు నష్టాలపై గత వారం రోజులుగా విద్యార్థులకు అవగాహనా సదస్సులు నిర్వహించామన్నారు. డ్రగ్స్‌కు అలవాటుపడి యువత తమ ఆరోగ్యాన్ని నాశనం చేసుకుంటున్నారని, డ్రగ్స్ వినియోగించడంవలన మానసిక, శారీరకంగా ఇబ్బందులకు గురై అనారోగ్యాల పాలవుతున్నారన్నారు. ఎవరైనా డ్రగ్స్ వినియోగించినా, విక్రయించినా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె. సునీత, అభ్యాస పాఠశాల ప్రిన్సిపాల్ పాలడుగుల రఘు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల, గవర్నమెంటు హైస్కూల్, అభ్యాస, ఏబీఎన్ పీఆర్ఆర్ డిగ్రీ కళాశాల, సంస్కృత కలాశాల విద్యార్థులు, పట్టణ ఎస్ఐ జుబేర్ మహ్మద్, రూరల్ ఎస్ఐ కె.సుధాకర్, హెచ్‌సీ చంద్రాల బాబూరావు, పోలీసు, ఎస్ఈబీ సిబ్బంది, సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

నిడదవోలులో అవగాహన ర్యాలీ

నిడదవోలు: నిడదవోలు పట్టణంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో స్థానిక అధికార్లు విద్యార్థులతో కలసి డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా యువత మేలుకో అంటూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బాలుర జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. గణేష్‌చౌక్ సెంటరులో మానవహారం నిర్మించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

దేవరపల్లి: జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా దేవరపల్లిలో ఎస్ఈబీ అధికారులు, పోలీస్ అధికారులు, బీహెచ్ఎస్ఆర్ వీఎల్ఎం డిగ్రీ కాలేజీ, అంబటి సత్యనారాయణరాజు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు కలిసి ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్ ఎదురుగా మానవహారం నిర్వహించారు. ఎస్ఈబీ సీఐ కేవీస్వామి మాట్లాడు తూ మాదకద్రవ్యాలకు యువతలోనుకాకుండా ఉండాలని మత్తు పదార్థాలకు తమ జీవితాలు, కుటుంబాలు విచ్ఛిన్నం అవుతాయన్నారు. డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఈబీ ఎస్ఐ సుధీర్, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని చివటం గ్రామంలో బుధవారం మత్తుపదార్థాల దుర్వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. దేశానికి యువత ముఖ్యమని, యువత మత్తుపదార్థాల బారిన పడొద్దని పలువురు సూచించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


నల్లజర్లలో డ్రాగ్స్‌పై అవగాహన చేస్తున్న సీఐ దుర్గాప్రసాద్

యువత క్రీడలవైపు ఆసక్తి చూపాలి : ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం: యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా క్రీడల వైపు ఆసక్తి కనపరచాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రావ్యాల నివారణ దినోత్సవంలో భాగంగా దేవరపల్లి సీఐ బాలసురేష్ ఆధ్వర్యంలో గోపాలపురం ఎస్ఐ సతీష్‌కుమార్ పర్యవేక్షణలో ర్యాలీ నిరహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మద్దిపాటి మాట్లాడుతూ దేశజనాభాలో 35శాతంపైగా ఉన్న యువత దేశానికి వెన్నుముక లాంటి వారని యువత విద్యపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. గంజాయి, గుట్కా, పాన్‌పరాక్, ఖోకైన్ వంటి మాదకద్రవ్యాల విక్రయాలకు పాల్పడే వారి పై ఉక్కుపాదం మోపి వారిపై కఠినచర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు అలవాటుపడి జీవితం నాశనం చేసుకోవద్దు

నల్లజర్ల: డ్రగ్స్‌కు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని నల్లజర్ల సీఐ దుర్గాప్రసాద్ అన్నారు. బుధవారం నల్లజర్ల సెంటర్‌లో ఎస్ఆర్‌కే విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ మత్తు పదార్థాలు జీవితాలను నాశనం చేస్తాయని, మంచి భవిష్యత్ కోసం పోటీపడి చదువుకోవాలన్నారు.


నిడదవోలులో భద్రావతి సమేత భావనాఋషి ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి దుర్గేష్


గోపవరంలో మొక్కులు తీర్చుకుంటున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

మంత్రి దుర్గేష్ గెలుపుతో మొక్కు చెల్లింపు

• 1000 కొబ్బరికాయలు కొట్టిన పద్మశాలీ సంఘం ప్రతినిధులు

నిడదవోలు, జూన్ 26: నిడదవోలు నియోజకవర్గ కూటమి అభ్యర్థిగా కందుల దుర్గేష్ అఖండ విజయం సాధించి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీమంత్రిగా బాధ్యతలు స్వీకరించడంతో 1000 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకుంటున్నామని నిడదవోలు పద్మశాలీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నీలం నాగేంద్ర ప్రసాద్ అన్నారు. బుధవారం నిడదవోలు పట్టణంలోని గణేష్‌చౌక్ సెంటరులో ఉన్న భద్రావతి సమేత భావనాఋషి ఆలయంలో పద్మశాలీలు కందుల దుర్గేష్ అఖండ విజయంపై 1000 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ తన గెలుపుకోసం కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు కృషి చేయడంతో పాటు తమ ఆరాధ్య దేవతలను తన కోసం వేడుకున్నారని అన్నారు. తాను నిడదవోలు నియోజకవర్గ ప్రజలందరికీ ఎంతో రుణపడి ఉన్నానన్నారు. ఆయన వెంట బాబులు, రంగా రమేష్, పద్మశాలి సంక్షేమ సంఘం కార్యదర్శి బండారు రాంబాబు, ట్రెజరర్ మంచి వీర వెంకట సత్యనారాయణ, మల్లుల కామరాజు, కొప్పుల కాశీపతి తదితర్లు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే శేషారావు

కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని నిడదవోలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అన్నారు. బుధవారం నిడదవోలు మండలం గోపవరం గ్రామంలో టీడీపీ నాయకుడు మారిశెట్టి సూరిస్వామి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అభయాంజనేయ స్వామికి 108 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. అనంతరం గుబ్బాలమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ కూటమి విజయం ప్రజా విజయమని ఈ ప్రభుత్వ హయాంలో ప్రజలంతా సంతోషంగా జీవిస్తారని అన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు వెలగన సూర్యారావు, పంచదార దుర్గాప్రసాద్ పలువురు నాయకులు కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కూటమి గెలుపు పట్ల కొండాలమ్మకు ప్రత్యేక పూజలు

• కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే శేషారావు

ఉండ్రాజవరం, జూన్ 26 : రాష్ట్రంలో కూటమి గెలుపు పట్ల మండలంలోని దమ్మెన్ను కొండాలమ్మ గుడి వద్ద పెరవలి మండలం అజ్జరం గ్రామ శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూటమి గెలుపుతో సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే నియోజవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి బూరుగుపల్లి శేషారావు పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు పెచ్చెట్టి వెంకటశ్రీనివాసు, గుబ్బల దానయ్య, సానబోయిన ప్రసాద్, మల్లుల శ్రీను, గుబ్బల శ్రీను, పెచ్చెట్టి ఏడుకొండలు, సానబోయిన శ్రీను, పెచ్చెట్టి గణపతి, సానబోయిన సత్యనారాయణ, గుత్తుల సతీష్, పెచ్చెట్టి కళ్యాణ్, సానబోయిన స్వామి, పెచ్చెట్టి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ లీకై ఇంట్లో ఫర్నీచర్ దగ్ధం

దేవరపల్లి, జూన్ 26: గ్యాస్ లీకై ఇంట్లో వస్తువులు, ఫర్నీచర్ దగ్ధం కావడంతో రూ.5లక్షలు ఆస్తినష్టం జరిగిన సంఘటన మండలంలోని యాదవోలులో గురువారం జరిగింది. ఆర్ఐ వెంకటేశ్వర్లు తెలిపినవివరాల ప్రకారం యాదవోలు గ్రామానికి చెందిన అనిశెట్టి సత్యవతి ఇంట్లో వంట చేస్తుండగా రెగ్యులేటర్ వద్ద గ్యాస్ లీకై మంటలు వ్యాపించటంతో నిత్యావసర సరుకులు, ఫర్నీచర్, ఇంటి పైకప్పు దగ్ధం కావడంతో రూ.5లక్షల వరకు నష్టం వాటిల్లిందని తెలిపారు. మంటలను నిడదవోలు ఫైర్ సిబ్బంది అదుపు చేశారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ముమ్మరంగా వ్యవసాయ పనులు

పెరవలి, జూన్ 26 : గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మండల పరిధిలో ఈ సార్వా సీజన్‌లో సుమారు 7వేల 500 ఎకరాల్లో నాట్లు వేయడానికి రైతులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే కానూరు, ఉసులుమర్రు ప్రాంతాల్లో కొంతమేర నాట్లు పూర్తయ్యాయి. పెరవలి చుట్టుపక్కల ప్రాంతాల్లో నారుమడులు పోయడం, చేలు దమ్ములు చేయడం వంటి పనుల్లో రైతులు నిమగ్నమై ఉన్నారు.

పోతవరంలో ప్రజా దర్బార్

నల్లజర్ల, జూన్ 26 : నల్లజర్ల మండలం పోతవరంలో టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో యువకులు ప్రజా దర్బార్ నిర్వహించారు. బుధవారం గ్రామం లో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజల సమస్యలను ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుకు అందించి ప్రజల సమస్యలకు పరిష్కార మార్గం చూపించేందుకు తాము కృషి చేస్తున్నట్లు టీఎన్ఎస్ఎఫ్ నాయకులు ఘంటా దిలీప్, కొండేపాటి ఈశ్వర్(కేకేఆర్)తెలిపారు. గ్రామంలో ప్రజల నుంచి 152 వినతులు స్వీకరించినట్లు చెప్పారు. వీటిని త్వరలో ఎమ్మెల్యే మద్దిపాటి అందజేయనున్నట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో కూటమి సభ్యులు సతీష్ శర్మ, కొమరం వెంకట్రావు, దొండపాటి మహేశ్,షేక్ షబీర్,తరుణ్ పాల్గొన్నారు

అక్రమ టేకు కలప స్వాధీనం

నల్లజర్ల, జూన్ 26 :దూబచర్ల నుంచి కొయ్యలగూడెం అక్రమంగా టేకు రవాణా చేస్తున్న బొలేరో వాహనాన్ని అటవీశాఖ డీఆర్‌వో వేణుగోపాల్ తన సిబ్బందితో పట్టుకున్నారు. బుధవారంమధ్యాహ్నం అక్రమ టేకు రవాణా చేస్తున్నారని సమాచారం రావడంతో నల్లజర్లలో వాహనాల తనిఖీ నిర్వహించారు. బొలేరో వాహనంలో 45 టేకు దిమ్మలను ఉండడంతో వాహనంతోపాటు టేకు దిమ్మలను స్వాధీనం చేసుకుని రాజమహేంద్రవరం తరలించారు.

హోదా అనేది ప్రజలకు సేవ చేయడం కోసమే

• ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

గోపాలపురం, జూన్ 26: హోదా అనేది పెత్తనం కోసం కాదు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు చేయడం కోసమేనని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. నియోజకవర్గ ముఖ్య కేంద్రమైన గోపాలపురంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులతో విడివిడిగా బుధవారం మద్దిపాటి సమావేశమయ్యారు. ఎమ్మెల్యేగా అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేసిన అనంతరం నియోజకవర్గమైన గోపాలపురం విచ్చేసిన ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు గజమాల పుష్పగుచ్ఛాలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలంటూ వినతిపత్రం సమర్పించారు. ముఖ్యంగా మహాత్మా జ్యోతిరావుపూలే గురుకుల, బాలికల ఆశ్రం పాఠశాలకు భవన సదుపాయాలు ఏర్పాటుచేయాలని అదేవిధంగా ఉప్పరగూడెంకు చెందిన ఆరేళ్ళ బాలుడు బోను క్యాన్సర్‌తో బాధపడుతున్నాడని ఆర్థిక సాయంచేసి వైద్యం అందించాల్సి ఉందని ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే మద్దిపాటి బీసీ గురుకుల బాలికల ఆశ్రం పాఠ శాలకు అవసమైన అన్ని వసతులు కల్పించి గోపాలపురంలో కొనసాగేలా చేస్తానంటూ బాలికల తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. బోనుక్యాన్సర్‌కు అవసమైన వైద్యం తానే చేయిస్తానని బాలుడి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే మద్దిపాటి భరోసా కల్పించారు. అనంతరం మండల అధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ అధ్యక్షతన జరిగి సమావేశంలో మద్దిపాటి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి నిరంతరం సేవలందిస్తానని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో టీడీపా నాయకులు, కార్యకర్తలు, జనసేన బీజేపీ నాయకులు, కార్యకర్తలను కలుపుకుని అన్ని కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నెలకన్న సమస్యల పరిష్కారానికి దశల వారీగా పరిష్కరిస్తానని అన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రమేష్, సీనియర్ నాయకుడు కోర్లపాటి రాము, మండల బీసీసెల్ అధ్యక్షుడు వేముల నాగరాజు, నియోజకవర్గ మహిళా అధ్యక్షుడు కాకర్ల రామతులసి, ముత్యాల రాయుడు, భాస్కరరావు, సత్యనారాయణ, జ్యేష్ట శ్రీధర్, కూనపం ప్రసాద్‌బాబు, దాసరి రవి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.


గోపాలపురంలో ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలతో ఘన స్వాగతం పలుకుతున్న అభిమానులు

జాతీయ లోక్ అదాలత్‌లో
ఎక్కువ కేసులు రాజీ చేసుకోవాలి

• కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి డాక్టర్ శ్రీనివాసరావు

కొవ్వూరు, జూన్ 26: జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడంవలన కక్షిదారులు సమయం, డబ్బు ఆదా చేసుకోవచ్చునని కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం కోర్టు ప్రాంగణంలో ఇన్సూరెన్సు న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. అదనపుజిల్లా జడ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాలమేరకు జూన్ 29న కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అధాలత్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ లోక్ అధాలత్‌లో రాజీ పడదగిన సివిల్, క్రిమినల్, వాహన ప్రమాద కేసులు, చెక్ బౌన్స్ కేసులు, బీఎస్ఎన్ఎల్ బకాయి కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు రాజీ చేసుకోవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకుని సమయాన్ని, డబ్బుని ఆదా చేసుకోవాలన్నారు. ఎక్కువ కేసులు రాజీ చేసుకుని న్యాయవాదులు కోర్టుకు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో ఇన్సూరెన్సు న్యాయవాదులు పాల్గొన్నారు.

మంత్రి దుర్గేష్‌ను కలిసిన ఎమ్మెల్యే ముప్పిడి


మంత్రి కందుల దుర్గేష్‌ను సత్కరిస్తున్న కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, జూన్ 26 : రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమా ఫోటోగ్రఫీ శాఖా మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కందుల దుర్గేష్‌ను కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలుసుకుని సత్కరించారు. బుధవారం మంత్రి దుర్గేష్‌ను కలిసి పుష్పగుచ్ఛంతో అభినందించి, శాలువా కప్పి సత్కరించారు. మంత్రిని కలిసిన వారిలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, ఆళ్ళ హరిబాబు, నాదెళ్ళ శ్రీరామ్ పాల్గొన్నారు.

మంత్రి అచ్చెన్నాయుడిని కలిసిన జవహర్


మంత్రి అచ్చెన్నాయుడిని కలిసిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కె.ఎస్. జవహర్

రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రిగా బాధ్యతలు చేపట్టిన కింజరపు అచ్చెన్నాయుడిని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. బుధవారం విజయవాడలో ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేశారు.

బాపిరాజుకు సత్కారం


బాపిరాజును కలిసిన వైద్య సిబ్బంది

నల్లజర్ల, జూన్ 26 : నల్లజర్ల వైద్య సిబ్బంది, ఆశ వర్కుర్లు జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజును కలిసి సత్కరించారు. బుధవారం బాపిరాజు ఇంటికి వెళ్లిన వైద్య సిబ్బంది ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. రావూరి వెంకటరమణ, సవలం రామకృష్ణ, విడియాల శ్రీను, చింతా చైతన్య, కొయ్యలమూడి నాగార్జున పాల్గొన్నారు

నల్లజర్లలో రోడ్డు ప్రమాదం

నల్లజర్ల,జూన్ 26: నల్లజర్ల ఫ్లైఓవర్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు బోల్తా పడగా భీమడోలుకు చెందిన చోడిశెట్టి గోకుల్ సంతోష్ మూర్తి తీవ్రంగా గాయపడ్డాడు. మారెళ్ళమూడికి చెందిన ఉపాధ్యాయురాలు రామలక్ష్మి కొయ్యలగూడెం ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తూ తన కారులో కొయ్యలగూడెం నుంచి మారెళ్ళమూడి వస్తున్నారు. దేవరపల్లి నుంచి స్వగ్రామం భీమడోలు వెళుతున్న చోడిశెట్టి గోకుల్ సంతోష్ బైక్‌ను ఢీకొని కారు బోల్తా పడింది. రామలక్ష్మి సురక్షితంగా ఇంటికి చేరగా సంతోష్‌మూర్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎటువంటి కేసు నమోదు కాలేదు.